RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY | తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 73 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం, సెప్టెంబర్, 5, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 73 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, September, 5, 2025 | PAGES : 8 RS : 4 /-



## ఖైరతాబాద్ గణేశుడి దర్శనాలు

# నేటి అర్ధరాత్రి వరకే!

- ఖైరతాబాద్ గణపతి నిమజ్జనానికి షెడ్యూల్ ఖరారు
- శనివారం ఉదయం 6 గంటలకు శోభాయాత్ర ప్రారంభం
- మధ్యాహ్నం 1:30 గంటల్లోపే నిమజ్జనం పూర్తి
- శోభాయాత్రకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు
- నేటి నుంచే విగ్రహం తరలింపు పనులు ప్రారంభం

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** లక్షలాది మంది భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన కార్యక్రమానికి పోలీసులు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. శనివారం మధ్యాహ్నం 1:30 గంటలలోపే నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసేలా స్పష్టమైన షెడ్యూల్‌ను ప్రకటించారు. బుధవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. భక్తుల దర్శనం కోసం నేటి అర్ధరాత్రి 12 గంటల వరకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్టు అధికారులు స్పష్టం చేశారు.




## ట్రేడ్ టారిఫ్స్ తీరు

# దారుణం

- కాలం చెల్లిన వలసవాద విధానాలని విమర్శలు
- అమెరికా సుంకాలపై పుతిన్ అసహనం

బీజింగ్, : భారత్, చైనాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అండగా నిలిచారు. అమెరికా విధిస్తున్న సుంకాలను పరోక్షంగా వ్యతిరేకించారు. ఇరు దేశాలపై అమెరికా అవలంబీస్తున్న ట్రేడ్ టారిఫ్స్ ను పుతిన్ తీవ్రంగా ఖండించారు. ఇటు వంటి చర్యలు కాలం చెల్లిన వలసవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు. చైనాలో తన నాలుగు రోజుల పర్యటన తర్వాత పుతిన్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు 1.5 బిలియన్ల జనాభా కలిగిన భారతదేశం, శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా వంటి దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని పుతిన్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు.. దీర్ఘకాలంగా ఉన్న ఆయా దేశాల సార్వభౌమాధికారంపై దాడులుగా భావించే అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. వలస రాజ్యాల యుగం ముగిసిందన్న పుతిన్.. భాగస్వాములతో జాగ్రత్తగా మాట్లాడాలని ట్రంప్‌కు హితవు పలికారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పటికీ, చివరికి అన్ని విషయాలూ కొలిక్కివస్తాయని పుతిన్ అన్నారు. మళ్లీ ఆయా దేశాల మధ్య సాధారణ పరిస్థితులు చూస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## తండ్రి వెంటే చైనాకు కుమార్తె..

## ప్రపంచానికి వారసురాలిని.. పరిచయం చేస్తున్న

# కిమ్!

- తండ్రి కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి చైనాలో పర్యటిస్తున్న కుమార్తె జూ ఏ
- అంతర్జాతీయ వేదికపై 12 ఏళ్ల జూ ఏ కనిపించడం ఇదే తొలిసారి

చైనా: ఉత్తర కొరియాలో వారసత్వ రాజకీయాలపై కొంత కాలంగా జరుగుతున్న ప్రచారానికి తాజాగా మరింత బలం చేకూరింది. దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ తన 12 ఏళ్ల కుమార్తె కిమ్ జూ ఏను అంతర్జాతీయ వేదికపైకి తీసుకురావడమే ఇందుకు కారణం. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆతిథ్యం ఇస్తున్న ఓ సైనిక పరేడ్‌లో పాల్గొనేందుకు తండ్రితో కలిసి ఆమె బీజింగ్‌లో అడుగుపెట్టారు. ప్రత్యేక రైలులో ప్యాంగ్యాంగ్ నుంచి బీజింగ్ చేరుకున్న వారికి చైనా అధికారులు స్వాగతం పలికారు.



## జీఎస్టీ భారాలతో తప్పుదోవలో

# కేంద్రం

- ఈ మాత్రం సంస్కరణలకు ఎనిమిదేళ్ల కాలయాపన
- ఘాటుగా విమర్శలు చేసిన చిదంబరం



## కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్

# పర్యటన

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- వరద నష్టాలపై స్థానికులతో చర్చ
- బ్రిడ్జిల నిర్మాణంపై నివేదికలు తయారుకు ఆదేశం

**కామారెడ్డి, తెలంగాణ దిశ :** వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద ఈ ఏడాది వచ్చిం దని.. తమ ప్రభుత్వం బాధితులను కచ్చితంగా ఆదుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ బాధిత లకు అండగా నిలిచి ఆస్తి, ప్రాణ నష్టం జరగ కుండా చూశారని చెప్పుకొచ్చారు. కష్టం వచ్చినప్పు డు అండగా ఉండే వారే నాయ కులని తెలిపారు. బాధితులకు అండగా ఉండి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదుకున్నారని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అభినందించా రు. కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచించారు. గురువారం కామా రెడ్డి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రాంతాలను పరిశీ లించి బాధితులకు ధైర్యం చెప్పా రు. బురుగిద్ద వద్ద ఇసుక మేటలు వేసిన పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ క్రమంలో తమకు జరిగిన నష్టాన్ని రైతులు వివరించారు. అలాగే, లింగంపేట్ లో బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. బ్రిడ్జి కమ్ చెక్‌డ్యామ్ తరహాలో..



## కుటుంబ కలహాలతో

# వ్యక్తి దారుణం

## ముగ్గురు పిల్లలను చంపి ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్, తెలంగాణ దిశ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘోరం జరిగింది. తన ముగ్గురు పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కిరాతక తండ్రి.. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.



## పకడ్బందీ విధానాలతోనే

# కవిత అడుగులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 04, తెలంగాణ దిశ :** హడావిడిగా నిన్న కవితపై గులాబీ పార్టీ సస్పెన్షన్ వేటు విధించింది. సాధారణంగా ఒక కీలక నాయకు రాలిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే కచ్చితంగా పార్టీ అధ్యక్షుడు.. కార్యనిర్వాహక అధ్యక్షుడు సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ అవి లేకుండా సోమా భరత్ కుమార్, తక్కెళ్ళపల్లి రవీందర్రావు సంతకాలు మాత్రమే అందులో ఉన్నాయి. వారిద్దరు కూడా పార్టీకి కార్యదర్శులుగా ఉన్నారు. తనను సస్పెండ్ చేస్తూ లేఖ విడుదల చేసిన భారత రాష్ట్ర సమితి పై కవిత ఆగ్రహం వ్యక్తం చేయొచ్చు, ఇది చెల్లదంటూ పేర్కొనవచ్చు. కానీ అలాంటి పని కవిత చేయలేదు. పైగా భారత రాష్ట్ర సమితి అధిష్టానం దారి తప్పినప్పటికీ.. తను మాత్రం పకడ్బందీ విధానాలతోనే బయటకు వచ్చారు. పక్కాగా రాజీనామా చేశారు. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి ఆమె రాజీనామా చేశారు.

ఆ లేఖను పార్టీ అధ్యక్షుడికి పంపించారు. శాసనమండలి సభ్యత్వానికి కూడా కవిత రాజీనామా చేశారు. స్పీకర్ ఫార్మేట్ లోనే రాజీనామా లేఖను పంపించారు. వాస్తవానికి పార్టీకి, శాసనమండలి సభ్యత్వానికి కవిత రాజీనామా చేస్తారని ముందుగా ఊహించిందే. అయితే ఇందులో అసలైన సంచలనం ఏంటంటే.. పార్టీ పేరును కవిత ప్రకటించకపోవడం.. బుధవారం నాటి విలేకరుల సమావేశంలో కవిత తన రాజకీయ పార్టీ పేరును ప్రకటిస్తారని.. తన రాజకీయ కార్య క్షేత్రాన్ని వివరిస్తారని అందరూ అనుకున్నారు. కానీ అలా కాకుండా కవిత పార్టీ విషయంలో..

-తన రాజకీయ క్షేత్రాన్ని వెల్లడించకుండా సస్పెన్స్ కొనసాగిస్తున్న కవిత



## కవిత సస్పెన్షన్

# సరైనదే

- కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా
- హరీష్ రావుపై విమర్శలు అనుచితం
- మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

**మెదక్, తెలంగాణ దిశ :** ఎమ్మెల్సీ కవిత విషయంలో పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు- మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేసి కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు అని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. గత రెండు, మూడు రోజులుగా కవిత మాట్లాడు తున్న మాటలు చూస్తున్నాం. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కవిత తన తీరుతో పార్టీ కి ఎంతో నష్టం చేశారు. బీఆర్ఎస్‌కు సంపద లాం టి వ్యక్తి హరీష్ రావు.. ఆయనను బలహీన పరిచేలా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణ కు నష్టం కాదా..? అని ఆమె ప్రశ్నించారు. కార్యకర్తగా, నేతగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా అందరికీ అందుబాటులో ఉండి పనులు చేసిన వ్యక్తి హరీష్ రావు. నాడు హరీష్ రావు పనితీరును పొగిడిన వారే నేడు ఆరోపణలు చేస్తున్నారు. వారికి ఎలా మనసు ఒప్పుతుందో అర్థం కావడం లేదు.

# యంగ్ బాయ్స్ మట్టి గణపయ్యకు పది కేజీల డ్రైఫ్రూట్స్ విప్పపువ్వు లడ్డూ సమర్పించిన భక్తుడు

## - భద్రాచలంలో 18 ఏళ్లుగా మట్టి గణపతితో నవరాత్రోత్సవాలు

## - భక్తితో పాటు పర్యావరణం కాపాడటమే యంగ్ బాయ్స్ ఉద్దేశ్యం...



**భద్రాచలం,సెప్టెంబర్ 04,(తెలంగాణ దిశ):** దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం పుణ్యక్షేత్ర పట్టణంలో యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మట్టి గణపయ్యకు బోర పెద్దిరెడ్డి అనే భక్తుడు పది కేజీల విప్పలడ్డూను సమర్పించాడు. అనంతరం గణపతి మహారాజుకు దూప దీప నైవేద్యాలు అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భద్రాద్రి రామయ్య వనవాసం చేసిన ఈ ప్రాంతంలో వైకుంఠ రాముడికి అత్యంత ప్రీతిపాత్రనైనది కూడా విప్ప ప్రసాదమేనని అన్నారు. పర్యావరణ రహిత విగ్రహంగా పేరొందిన 18 అడుగుల మట్టి గణపయ్యకు వాటర్ కలర్స్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తిశ్రద్ధ లతో పూజలందుకుంటున్న గణపతి మహారాజుకు విప్పాపువ్వు డ్రైఫ్రూట్స్ లడ్డు అందించి మొక్కును తీర్చుకున్నానని భక్తుడు తెలిపాడు. బొజ్జ గణపయ్యకు నిర్వహించిన పూజా కార్యక్రమంలో పి. శ్రీకాంత్ రెడ్డి, మల్లెల లోకేష్ కుమార్, సీరపు సాయి సంపత్ రెడ్డి, ఆకుల వెంకట్, బెల్లంకొండ పుష్పగిరిలు పాల్గొన్నారు.

### 18 అడుగుల మట్టి మహా గణపయ్య...

భద్రాచల పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సెంటర్‌నందు గణపతి నవరాత్రి ఉత్సవాలు వినూత్నంగా జరుగుతున్నాయి. ప్రతి యేటా పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్టిస్తూ గత 22 ఏళ్లుగా యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ ఉత్సవాలను నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రలోని బొంబాయి ప్రాంతం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన



18 అడుగుల భారీ మట్టి మహా గణపయ్య విగ్రహం పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

### ఆరోగ్యానికే కాదు.. భక్తికి, పవిత్రతకూ విప్పలడ్డూనే అతి ముఖ్యం...

భద్రాచలం ఏజెన్సీలోని వస్తారంగా లభించే అటవీ ఉత్పత్తుల్లో విప్ప పువ్వు ఒకటి. గిరిజనులు సేకరించిన విప్పువ్వ ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే గాకఅనేక అనారోగ్య సమస్యలను రూపుమాపే దివ్య ఔషద గున్నాలన్న 10 కేజీల విప్పపువ్వు డ్రైఫ్రూట్స్ లడ్డూను తయారు చేసి గణపతి మండపంలో సమర్పించి భక్తిని చేటుకున్న బోర పెద్దిరెడ్డి అనే భక్తుడిని పట్టణ ప్రముఖులు ప్రశంశించారు.

# రాజీవ్ గాంధీ నగర్ వినాయక మండపంలో అన్న ప్రసాద వితరణ



**కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ) :**నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ లో లయన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ గురువారం ప్రారంభించారు. అనంతరం విఘ్నేశ్వరుడికి నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేషుడు శోభాయాత్ర కార్యక్రమంలో యువతీ యువకులు భక్తిశ్రద్ధలతో భద్రతను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని సాఫీగా జరిగేటట్టు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, సన్నీ, విజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల విష్ణు, ప్రవీణ్, కేశవ్, శివ, హరీష్, నాని, నగేష్, గౌతమ్ ప్రసాద్, వీరేష్, కావలి సాయి కిరణ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

## - బ్రహ్మకుమారి కల్పన

## - బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

## -పలువురు ఉపాధ్యాయులకు సన్మానం




**హుజురాబాద్, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ)** :సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని బ్రహ్మకుమారి కల్పన అన్నారు. గురువారం హుజరాబాద్ పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం సెంటర్ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారిలు కల్పన, శ్రీవాణి మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకే స్థానం ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బ్రాహ్మ తో పోల్చారని, గురువు విద్యార్థుల్లో చెడు ఆలోచనలను తొలగించి వారిని సన్మార్గంలో నడిపించే విధంగా కృషి చేయాలన్నారు. బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో విలువలను పెంపొందిస్తూ ఆలోచన విధానాల్లో మార్పు వచ్చే విధంగా ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



ముఖ్యంగా ప్రపంచంలో శాంతిని నెలకొల్పడం కోసం బ్రహ్మ కుమారిస్ సంస్థ ఎంతగానో కృషి చేస్తున్నదన్నారు.సమాజంలో ఉపాధ్యాయులు ఒక మార్పు తీసుకురావాలి..ఉపాధ్యాయులు సమాజంలో ఒక మార్పు తీసుకువచ్చి నూతన సమాజాన్ని నిర్మించాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఎన్నో నైతిక చర్యలు చూస్తున్నామని, వాటిని అరికట్టేందుకు పాఠశాల నుండే బ్రహ్మకుమారి ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో మెడిటేషన్ కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక భావన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కృషిలో ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు కొంత ఆధ్యాత్మిక అంశాలను బోధించాలని కోరారు. సబ్జెక్టులే కాదు జీవిత పాఠాలు కూడా బోధించాలన్నారు. టీచర్ ఒక నిచ్చన లాంటి వారని, విద్యార్థుల ఎదుగుదలకు ఎంతో కృషి చేస్తారన్నారు. ఉపాధ్యాయులందరూ చిరునవ్వుతో విద్యార్థులకు ఒక హ్యూమన్ టచ్.. హ్యూమన్ కేర్ అనేది ఇస్తే దాంతో పిల్లలు చాలా మోటివేట్ అవుతారన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చాలా ఉత్సాహంతో బోధిస్తూ వారిని అభినందిస్తే ఎంతో ఆనందంగా ఉంటారన్నారు. ఈ పద్ధతి ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో మంచి మార్గంలో ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులను అంగన్ వాడి టీచర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారి సెంటర్ ఇంచార్జీ శ్రీ వాణి, ఈశ్వరయ్య, రాజయ్య, జ్యోతి రాణి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా గంగిరెడ్డి ఆదిరెడ్డి

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా గంగిరెడ్డి ఆదిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంతరెడ్డిని గురువారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి తన నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంతరెడ్డి గంగిరెడ్డి ఆదిరెడ్డిని ఘనంగా సన్మానించారు. నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన గంగిరెడ్డి ఆదిరెడ్డికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్



రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి అంజాద్, షకీలు దిన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్ రెడ్డి, సోము, విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప గణేశుడికి ప్రత్యేక పూజలు

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు మండపాలలో ఏర్పాటు చేసిన గణేశుల ప్రతిమలకు గురువారం కాంగ్రెస్ పార్టీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప, రాజీవ్ గాంధీ నగర్, నిజాంపేట గ్రామ పంచాయతీ, ఇందిరమ్మ కాలనీ ఫేస్ వన్, నిజాంపేట్ ప్రధాన రహదారిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించారు. పలు కాలనీలలో నిమజ్జనం సమయం సమీపిస్తుండడంతో పలువురు మండపాల నిర్వాహకులు మండపాల వద్ద గురువారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా, ఆనందోత్సవాలతో గణపతుల నిమజ్జన కార్యక్రమం పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు. నిమజ్జనం సమయంలో పోలీసులు



సూచించినట్టుగా జాగ్రత్తలు తీసుకొని ప్రశాంతంగా గణపతి ప్రతిమల నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా బస్తీల సంఘాల నేతలు, గణేష్ మండపాల నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ. 3 కోట్లతో సుభాష్ నగర్ పైప్ లైన్ రోడ్ నుండి సుచిత్ర వరకు లింక్ రోడ్ పనుల పరిశీలన

## - ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కెపి. వివేకానంద్ సుచిత్రా రోడ్డు సుభాష్ నగర్ పైప్‌లైన్ రోడ్‌ను కలిపేలా మంజూరైన లింక్ రోడ్డును సంబంధిత హెచ్ఆర్ డిసిఎల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి పూర్తయిన తర్వాత రెండు ప్రధాన రహదారులపై ఉన్న ట్రాఫిక్ భారం తగ్గుతుందన్నారు. దీంతో ప్రజలకు ప్రయాణ సమయం ఆదా అవుతుందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో రహదారి మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా మెరుగైన కనెక్టివిటీ, సాఫీగా ట్రాఫిక్ ప్రవాహం, ప్రజలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ డిసిఎల్ అధికారులు ఈఈ మెహబూబ్ మియా, డిఈ అరవింద్, ఎఈ శ్రీలత, బిఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి, గుమ్మడి మధుసూదన్, కాలే నాగేష్, బలరాం,



బాల మల్లేష్, విజయ హరీష్, కాలే గణేష్, మధు కృష్ణ, లక్ష్మీ గంగా ఎన్ క్లేవ్ వాసులు రమణా రెడ్డి, భాస్కర్ రెడ్డి, సత్తి రెడ్డి, కౌశిక్, సాయికిరణ్ గౌడ్, లోటస్ హెూమ్స్, లోటస్ ఫార్చ్యూన్ అపార్ట్ మెంట్ వాసులు సతీష్ చంద్ర, పురుషోత్తం చారి, సాయిప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, వెంకట్ గౌడ్, ఆంజనేయులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడికి భారత అథ్లెట్ నందిని ప్రత్యేక పూజలు



**కాప్రా, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ):** గణేష్ నవరాత్రి ఉత్సవాలు కాప్రా ఏఎస్ రావునగర్ డివిజన్ లో అంగ రంగ వైభవంగా కొనసాగుతున్నాయి. కాప్రా డివిజన్ చంద్రపురి కాలనీలో నివాసముంటున్న భారత క్రీడాకారిణి నందిని అగసర తన నివాసం సమీపంలో ఏర్పాటు చేసిన గణనాధునికి గురువారం కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ



సందర్భంగా కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష రెడ్డి మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో క్రీడల్లో నందిని అగసర మరింత రాణిస్తూ మరిన్ని పతకాలు కైవసం చేసుకుంటూ ప్రపంచ స్థాయిలో భారత్ పేరును నిలబెట్టాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, జవహర్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సాయిలు, స్థానిక నాయకులు సుశీల్ కుమార్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులలో చైతన్యం నింపుతున్న వికలాంగుల వాయిస్ మాస పత్రిక

## - 11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన కలెక్టర్ రాధికా గుప్తా



**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ)** :వికలాంగుల వాయిస్ మాస పత్రిక 11వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకట్, జిల్లా నాయకులు ఎస్. రమేష్, శివ కుమార్, శ్రీను లతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ వికలాంగులతో పాటు సకలాంగులలో చైతన్యం తీసుకురావడానికి వికలాంగుల వాయిస్ మాస పత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.

# శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

**కుషాయిగూడ, సెప్టెంబర్ 05, (తెలంగాణ దిశ) :**
పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. దేవాదాయ శాఖ పరిశీలకులు కె. మోహన్ రెడ్డి పర్యవేక్షణలో హుండీలను విప్పి లెక్కించగా ఐదు నెలలకు గాను రూ. 7,41,193/- ల ఆదాయం వచ్చింది.

హుండీల లెక్కింపులో దేవస్థాన ఫౌండర్ ట్రస్టీ వుప్పల యాదగిరి రెడ్డి, పల్లె సురేందర్ రెడ్డి, పల్లె శ్రీకాంత్ రెడ్డి ఆలయ కార్య నిర్వాహణాధికారి మఠం వీరేశం, పోలీసు వారు, సేవా సమితి వారు, స్థానిక భక్తులు, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



# టీఎస్ఐఐసి కాలనీలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

**కుషాయిగూడ, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ):** కుషాయిగూడ పారిశ్రామిక ప్రాంతంలోని టీఎస్ఐఐసీ కాలనీలో రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దుర్వాసన, దుర్గంధం వెదజల్లుతుంది. రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోవడంతో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కాలనీలోని అపోలో కంప్యూటర్ లాబోరేటరీస్ పక్కన పేరుకుపోయిన చెత్తను పారిశ్రామిక మున్సిపాలిటీ అధికారులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



# సంపాదకీయం

## పారిశ్రామిక తిరోగతి..!

గత నాలుగేళ్ళలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పారిశ్రామిక ఉత్పత్తిలో తగ్గుదల నమోదు కావటం భారత ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రమాద ఘంటిక. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ తగ్గుతున్న దాని పర్యవసానమే ఈ పరిస్థితి! భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమిస్తున్నదని గత కొంతకాలంగా ఢంకా భజాయి స్తున్న మోడీ సర్కారు పనితీరుకు ఇది అక్షరాలా ప్రతికూల నివేదిక. ప్రజల ఆర్థిక స్థితి రోజురోజుకూ దిగజారుతున్నదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో- ప్రజలు తమ రోజువారీ జీవన వ్యయాన్ని కూడా తగ్గించుకుంటున్నారని కేంద్ర గణాంకాల శాఖ విడుదల చేసిన పారి శ్రామిక ఉత్పత్తి సూచి (ఐఐపి) తేటతెల్లం చేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ప్రధాన పారిశ్రామిక రంగాలన్నీ ఉత్పత్తిలో గణనీయంగా తగ్గుదలను నమోదు చేశాయి. కోవిడ్ ఉత్పాతం తరువాత ఇంత తక్కువ వృద్ధి రేటు నమోదు కావడం ఇదే మొదటిసారి. 2021 - 22లో 11.4 శాతంగా నమోదైన వృద్ధి రేటు ఈ ఏడాది 4 శాతానికే పరిమితం అయింది. 2023 %-% 24 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినా ఇది 1.9 శాతం తక్కువగా ఉంది. మేకిన్ ఇండియా పేరిట కేంద్ర ప్రభుత్వం హడావిడి చేస్తున్నప్పటికీ- అంకెల్లో వ్యక్తమవుతున్న వాస్తవ దృశ్యం ఇదీ! ప్రజల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టకుండా పాలకులు ఎన్ని ప్రగల్భాలు పలికినా ఫలితం ఉ ండదు అనటానికి ఐఐపి నివేదిక నిదర్శనం. మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలను నెత్తిన వేసుకొని, ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తోంది. అంబానీ, అదానీ తదితరులకు లాభాలను దోచిపెట్టేలా పనిగట్టుకొని ప్రభుత్వరంగ సంస్థలను దెబ్బ తీస్తోంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని దేశ యువతకు ఆశ కల్పించి, గద్దెనెక్కాక ఆ మాటనే పూర్తిగా మర్చిపోయింది. ప్రజలు దానిని గుర్తు చేస్తుంటే- జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏవిధంగానూ దోహదపడని ఉన్మాదం, ఉద్రేకాల వైపు యువతీ యువకులను మళ్లిస్తోంది. ఉదార ఆర్థిక విధానాల్లో భాగంగా శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి, అన్నింటా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగు పద్ధతుల్లోనే ఉద్యోగులను నియమిస్తోంది. ఆఖరికి దేశభద్రతకు అత్యంత కీలకమైన రక్షణరంగంలోనూ లక్షలాది పోస్టులూ ఖాళీగా ఉన్నా- అగ్నివీర్ పేరిట తాత్కాలిక నియామకాలతోనే కాలయాపన చేస్తోంది. గ్రామీణ ప్రజలకు కాస్త ఆదాయాన్ని గ్యారంటీ చేసే ఉపాధి హామీ చట్టాన్ని ఏటేటా నిధులు తగ్గించటం ద్వారా నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గ్రామీణ భారతానికి వెన్నెముకలా ఉన్న వ్యవసాయరంగం రాయితీల తగ్గింపు, అరకొర మద్దతు ధరతో నానాటికీ కుదేలవుతోంది. సాఫ్ట్‌వేర్ మొదలుకొని ప్రతి ప్రైవేటు, కార్పొరేటు రంగం లోనూ ఉద్యోగులపై పనిభారం పెంచటం, నిజవేతనాలు తగ్గించటం కొన్నేళ్లుగా సాగుతోంది. వీటన్నింటి పర్యవసానంగా ప్రజల ఆదాయాలు తగ్గి, కొనుగోలు శక్తి క్షీణించిపోతోంది. ఆహారం, బట్టలు తదితర రోజువారీ వినియోగ వస్తువులపై ప్రజల ఖర్చు గతేడాదితో పోలిస్తే 4.7 శాతం తగ్గినట్టు కన్జ్యూమర్ నాన్ డ్యూరబుల్ పద్దు స్పష్టం చేస్తోంది. రోజువారీ అవసరాలను తీర్చుకోలేని స్థితిలో ప్రజలున్నారని చెప్పటానికి ఇది సూచిక. వాహనాలు, గృహోపకరణాలు వంటి వినిమయ వస్తువుల ఉత్పత్తి కూడా మందగించింది. నెలవారీ చెల్లింపుల (ఇఎంఐ) పద్ధతిని కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి కాబట్టే- ఈ రంగంలో ఈపాటి కొనుగోళ్ళు అయినా జరుగుతున్నాయి. ఆర్థికమాంద్యం ఆవరిస్తున్న పరిస్థితుల్లో రానున్న కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి మరింత క్షీణించే ప్రమాదముందని ఆర్థికవేత్తల హెచ్చరిక. అమెరికా విధిస్తున్న పన్నుల భారం కూడా మన ఎగుమతులపై తీవ్రంగా ఉంటుంది. ఆక్వా తదితర రంగాలపై ఆ ప్రభావం ఇప్పటికే పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి గురించి కబుర్లతోనే కాలక్షేపం చేయకుండా- క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు అనుగుణంగా వ్యవహరించాలి. ప్రజల నిజ వేతనాలను పెంచే ముమ్మర చర్యలు చేపట్టాలి. పైకి ఆడంబరంగా కనిపించే ఉదార ఆర్థిక విధానాలు కార్పొరేట్లకు లాభాలు కురిపించి, సామాన్యులకు అంతకుమించిన కష్టనష్టాలను చవి చూపిస్తాయన్న వాస్తవం ఇప్ప టికే ఆచరణలో తేలిపోయింది. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ప్రజల కొనుగోలుశక్తిని పెంచాలి. తద్వారా పారిశ్రామిక, ఆర్థిక రంగాలను మెరుగుపరచాలి.

# బజ్‌రంగ్ యూత్ అసోసియేషన్ గణనాధునికి ప్రత్యేక పూజలు



**ఏఎస్ రావు నగర్,సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ):** ఈసీఐఎల్ చౌరస్తాలోబజరంగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాధునికి పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బజరంగ్ యూత్ అసోసియేషన్ చైర్మన్ పి. శరత్ చంద్ర చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామ్ చందర్ రావు, ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డివాకులాభరణం కృష్ణమోహన్, ఒక ఒక సినీ నటులు మంచు మనోజ్ దంపతులు గణనాధుని దర్శించుకున్నారు ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులను అభినందించారు. ప్రముఖుల రాకతో ఈసీఐఎల్ ప్రాంతం లో జన సందోహంతో నిండిపోయింది.




# గణనాథుడికి భారత అథ్లెట్ నందిని ప్రత్యేక పూజలు



**కాప్రా, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు కాప్రా ఏఎస్ రావునగర్ డివిజన్ లో అంగ రంగ వైభవంగా కొనసాగుతున్నాయి. కాప్రా డివిజన్ చంద్రపురి కాలనీలో నివాసముంటున్న భారత క్రీడాకారిణి నందిని అగసర తన నివాసం సమీపంలో ఏర్పాటు చేసిన గణనాధునికి గురువారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి డిసిపి పద్మజ, కుషాయిగూడ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎల్,భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు బొంతు బొంతు, ప్రభుదాస్, ప్రభుదాస్ గుప్తా, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, గొల్లూరి అంజయ్య, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సుడుగు మహేంద్ర రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో క్రీడల్లో నందిని అగసర మరింత రాణిస్తూ మరిన్ని పథకాలు



కైవసం చేసుకుంటూ ప్రపంచ స్థాయిలో భారత్ పేరును నిలబెట్టాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ సబ్ ఇన్ స్పెక్టర్ సాయిలు, జై శ్రీ గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు సుంకరి సుశీల్, ఎల్లప్ప, తరుణ్, భాను, హర్ష, వంశీ, విన్నేత్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ కాలేజీల ఫీజులు.. అడ్డగోలుగా వసూళ్లు..

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా ఇతర ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదలచేసిన మార్గదర్శకాలు ఉత్తుత్తి కొలమానాలను తలపిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన సవరణ నిబంధనలను పక్కనబెట్టి తూతూమంత్రం గా ఫీజులను నిర్ధారిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఫీజుల నిర్ధారణ కోసం సోమవారం నుంచి ప్రారంభమైన కాలేజీల పునర్విచారణ నామ్‌కేవాస్తేగా సాగుతుంది. ప్రభుత్వం సవరించిన నిబంధనల ప్రకారం కాలేజీల్లో ఏమున్నాయి? ఏం లేవో? తేల్చి ఫీజులను ఖరారు చేయకుండా కాలేజీలు ఇచ్చిన నివేదికలనే బేస్ చేసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది.

ఇంజినీరింగ్‌కాలేజీల ఫీజులపై తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) పునర్విచారణ నుంచి ప్రారంభమైంది. మొత్తం160 ఇంజినీరింగ్ కాలేజీల ను సెప్టెంబర్ 3 వరకు పునర్విచారణ చేయనున్నారు. అయితే తొలిరోజై 20 కాలేజీలను పిలువగా, అందులో 17 కాలేజీలను టీఏఎఫ్ఆర్సీ అధికారులు విచారించి నట్టు తెలిసింది. మరో మూడు కాలేజీలు గైర్హాజరయ్యాయి. విచారణకు పిలిచిన కాలేజీల ఫీజులపై ఎలాంటి విచారణ జరగలేదని పలు కాలేజీల యాజమాన్యాలు తెలిపాయి. అయితే ఆయా కా లేజీల నుంచి టీఏఎఫ్ఆర్సీ అధికారులు గతంలో సమర్పించిన ఆడిటింగ్ నివేదికలు అసలైనవేనని అఫిడవిట్లు తీసుకొని పంపించేశారు.ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజుల నిర్ధారణకు ప్రభుత్వం జారీచేసిన నిబంధనలు

పక్కకేనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ మార్గదర్శకాలు ఇప్పుడు



వర్తించవని, వచ్చే బ్లాక్ (మూడేళ్లు) పీరియడ్‌కు వర్తిస్తాయని ఓ కీలక అధికారి పేర్కొన్నారు. మళ్లీ కోర్టు తీర్పు ఆధారంగా నడుచుకుంటామని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ముందుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. దీంతో కాలేజీల యాజమాన్యాల్లో గందరగోళం

తలెత్తనున్నది.అయితే ఇంత కసరత్తు చేసి ఏం ప్రయోజనమన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఫీజుల పెంపుపై సర్కారు ఇటీవలే కీలక ఆదేశాలిస్తూ జీవో నంబర్ -33ను జారీచేసింది. కళాశాలలు సమర్పించే అకౌంట్లతో పాటు, మౌలిక వసతులు, ఫ్యాకల్టీ,

కాలేజీ ర్యాంకింగ్, విద్యాప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని ఫీజులను నిర్ధారించాలన్నది. కానీ అవేమీ పట్టించుకోకుండా కేవలం కాలేజీల నుంచి అఫిడవిట్లను మాత్రమే తీసుకుంటున్నారు.

# టార్గెట్ గొట్టిపాటి..

**ఒంగోలు, తెలంగాణ దిశ :** వైయస్సార్ కాంగ్రెస్ అధినేత ప్రకాశం జిల్లాపై దృష్టి పెట్టారు. ప్రధానంగా అద్దంకి నియోజకవర్గం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. అక్కడ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు. సమర్థుడైన నాయకుడిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా తేవాలని చూస్తున్నారు. 2029 ఎన్నికల్లో గొట్టిపాటి రవికుమార్ ను ఓడించే నేతను తేవాలన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్. ఈ క్రమంలో సీనియర్ నేత కరణం బలరామకృష్ణమూర్తి సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. ఎలాగైనా 2029లో అసెంబ్లీలో గొట్టిపాటి రవికుమార్ అడుగుపెట్టకూడదు అన్నది జగన్మోహన్ రెడ్డి ప్లాన్.అద్దంకి అంటే ముందుగా గుర్తుకొచ్చేది కరణం బలరాం. ఆ నియోజకవర్గంలో తనకంటూ ఒక ముద్ర చాటుకుంటూ వచ్చారు. కానీ గొట్టిపాటి రవికుమార్ కు బ్రేక్ వేయలేకపోయారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రవికుమార్ వరుసగా ఐదు సార్లు గెలుస్తూ వచ్చారు. అద్దంకిలో అయితే నాలుగు సార్లు వరుస విజయంతో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. రెండున్నర దశాబ్దాలుగా అక్కడ రాజకీయాలను శాసిస్తున్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారు. అందుకే రవికుమార్ హవాకు బ్రేక్ వేయాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. 2004లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు

# నూతన వ్యాయామశాల ప్రారంభం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని హరితవనం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరన్ బీస్ట్ వ్యాయామశాలను బాచుపల్లి సీఐ సతీష్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐరన్ బీస్ట్ జిమ్ నిర్వాహకుడు సంతోష్ కుమార్ ను అభినందించారు. యువత శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారని ఇందుకు అత్యంత ఆధునాతన జిమ్ లు తోడ్పడతాయని అన్నారు. జిమ్ ప్రారంభోత్సవానికి స్థానిక మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ యువత వ్యాయామంపై దృష్టి సారించి ఆరోగ్యానికి కాపాడుకుంటూ శరీర దృఢత్వాన్ని స్థిరపరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, హర్ష, వివేక్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# కులాహలంగా నేతాజీ నగర్ చౌరస్తా గణనాథుని నిమజ్జనం



**కాప్రా, సెప్టెంబర్ 04, (తెలంగాణ దిశ):**
కాప్రా డివిజన్ నేతాజీ నగర్ చౌరస్తాలో నేతాజీ నగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాధుని గురువారం అంగరంగ వైభవంగా నిమజ్జనం చేశారు. దేదీప్యమానమైన విద్యుత్ దీపాలు, భాజా భజంతులతో స్వామివారిని కాప్రా చెరువు వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డు వేలం పాటను నిర్వహించారు. రూ. 1. 26 లక్షలకు ప్రకాష్ రాథోడ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాయల్ స్టూడియో యజమాని గౌసోద్దీన్ ను ఘనంగా సన్మానించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ నాయకులు వనం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం




**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 04,(తెలంగాణ దిశ) :** జీఎస్టీ తగ్గింపు ద్వారా బడుగు, బలహీన, అల్పాదయ వర్గాల వారికి ఊరట కలిగించిన ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి గురువారం రాష్ట్ర బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ప్రగతి నగర్ కు చెందిన డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు పలువురు నేతలు పాల్గొన్నారు.


# అసత్య ఆరోపణలు మానుకోవాలి

**మంథని, తెలంగాణ దిశ :** మంథని గౌడ సంఘం అని చెప్పుకుంటున్న నాయకులు నాపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని గంగపురికి చెందిన తాటి సమ్మయ్య గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను దొంగ లెటర్ ప్యాడ్ తయారుచేసి ఐడి కార్డులను తొలగించినట్లు ఆరోపణలు చేసిన గౌడ సంఘం నాయకులు వాటిని నిరూపించేం దుకు వారి దగ్గర ఆధారాలు ఉంటే చూపించాలని ఆయన తెలిపా రు. అంతేకాకుండా తాము పాసుబుక్కులతో పాటు ఇతర బుక్కులను దాచిపెట్టినట్టు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని వారు కోరారు. ఆధారాలు లేని మాటలు మాట్లాడి వ్యక్తులను ఇబ్బందు లకు గురి చేయవద్దని వారు పేర్కొన్నారు సంఘానికి నష్టం కలిగే విధంగా చేసిన వారిపై ప్రశ్నిస్తే సంఘ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రకటనలు చేయడం మానుకోవాలని వారు హితవు పలికారు. మరోసారి తమపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు

# మధిర ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర పురస్కారాలు

**మధిర, తెలంగాణ దిశ :** ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి తోడ్పడే ప్రతిభను ప్రోత్సహిస్తూ ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లతో పాటు మెకానిక్, సిబ్బందికి అవార్డుల ప్రధాన కార్యక్రమం మధిర డిపోలో నిర్వహించారు. మధిర ఆర్టీసీ డిపోలో ప్రగతి చక్ర పురస్కార అవార్డులను ఖమ్మం రీజినల్ మేనేజర్ హరి రామ్ అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ స ంస్థను ప్రగతి పథంలో నడిపించడం ఉద్యోగుల ద్వారానే సాధ్యమవు తుందన్నారు. ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలలో సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఇలాంటి ఉద్యోగులు ఉండడం వల్లే సంస్థకు గుర్తింపు, ప్రయాణికులకు సుఖ ప్రయాణం జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మరి డిపో మేనేజర్ శంకర్రావు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, అకౌంట్ ఆఫీసర్ జోస్నా, పర్సనల్ ఆఫీసర్ సంపత్ కుమార్, ఉమ్మడి ఖమ్మం సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి వెంటాడుతున్న ప్రమాదాలు




**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :** ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయింది. పాలనాపరంగా ఇప్పుడిప్పుడే ప్రభుత్వం కుదుటపడుతోంది. మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. అదే సమయంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధపడింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో ఏపీలో విపత్తులు, వివాదాలు, ప్రమాదాలు ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పది నెలల్లోనే ఏపీ ప్రభుత్వం చాలా రకాల విపత్తులను ఎదుర్కొంది. ప్రభుత్వానికి అవి సవాల్ గా మారా యి. అయినా సరే కూటమి ప్రభుత్వం తట్టుకొని ముందుకు సాగు తోంది. సహజంగానే విపత్తులను, ప్రమాదాలను ప్రతిపక్షం రాజకీ యాలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం జరుగుతున్నది అదే.గత ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సెప్టెం బర్లో విజయవాడను బుడమేరు ముంచేసింది. దీంతో వేలాది కుటుం బాలు వరదల్లో చిక్కుకున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారు. కనీసం ఆహారం కూడా వారికి దొరకని పరిస్థితి. అటువ ంటి సమయంలో సీఎం చంద్రబాబు నేనున్నాను అంటూ బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. రోజుల తరబడి విజయవాడలోనే మకాం వేసి బాధితులకు స్వయంగా వరద నీటిలోనే వెళ్లి పరామర్శిం చారు. వారికి అన్ని విధాల సాయం చేశారు. రాత్రికి రాత్రి వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు వర్కౌట్ అయ్యాయి. అయితే ఈ కష్టం నుంచి బయటపడే క్రమంలో.. ఏలూరు లోని ఎర్ర కాలువ పొంగింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఇబ్బందులు తప్పలేదు.అటు తర్వాత ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఉద్యోగులతో పాటు కార్మికులు చనిపోయారు. అటు తర్వాత కాకినాడలోని పరిశ్రమలో సైతం ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల పరామర్శ, వారికి పరిహారం అందించడంలో ప్రభుత్వం ముందంజలో నిలిచింది. క్యాబినెట్ మంత్రులు సైతం నేరుగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వప రంగా అండగా నిలిచారు.ఈ ఏడాది జనవరిలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల పంపిణీలో అపశృతి జరిగింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోయారు. ఇది పెను వివాదానికి దారితీసింది. మృతుల కుటుం బాలకు టీటీడీతో పాటు ప్రభుత్వం అండగా నిలిచింది. పరిహారం కూడా అందించింది.మరోవైపు తూర్పుగోదావరి జిల్లాలో బాణాసంచా పేలుడు కారణంగా 8 మంది చనిపోయారు. తాజాగా సింహాచలంలో జరిగిన ఘటనలో భక్తులు మరణించారు. ఇప్పుడు వారికి ప్రభుత్వం పరిహారం కూడా అందించింది. ప్రభుత్వం పాలనలో మునిగి తేలుతున్న తరుణంలో ఇలా ప్రమాదాలు, వివాదాలు, విపత్తులు.. తీవ్ర ఇబ్బందికరంగా మారుతున్నాయి.

# సైబర్ ఉచ్చులో చదువుకున్నవాళ్లే ఎక్కువ



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** హైదరబాద్ మియాపూర్‌కు చెందిన 40 ఏళ్ల ఐటీ ఉద్యోగి, ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ఓ యాడ్ ద్వారా ట్రేడింగ్ స్కామ్‌కు గురై ?38.62 లక్షలు కోల్పోయాడు. వ్యాపారంలో ?1.3 కోట్లు లాభాలుగా చూపించినా, అతని ఖాతాలో జమయిన మొత్తం కేవలం ?200 మాత్రమే. ఈ కేసును సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.బాధితుడు మొదట ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్‌లో "ప్రియా శర్మ"గా తాను పరిచయం చేసుకున్న యువతి అతనికి ట్రేడింగ్ గురించీ, అధిక లాభాలు పొందే పద్ధతుల గురించీ వివరించింది. ఆమె అతనికి "యాఐ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ" అనే యాప్ ఉపయోగించమని సూచించింది. దీనివల్ల బ్లాక్ ట్రేడ్స్, అప్పర్ సర్క్యూట్ స్టాక్స్ వంటి విషయాల్లో మోహపూ రితమైన వ్యూహాలతో అతన్ని పెట్టుబడి పెట్టించేందుకు ప్రోత్సహిం చిందివాట్సాప్ గ్రూప్‌లో వేరే సభ్యుల ద్వారా ఇచ్చిన టెస్టిమోనియల్స్, స్క్రీన్‌షాట్‌లతో ఆకర్షితుడైన బాధితుడు తొలుత ?50,000 పెట్టుబడి పెట్టి, తరువాత నెమ్మదిగా పెంచుతూ మొత్తం ?14.87 లక్షలు పెట్టాడు. మొత్తంగా అతను తన ఖాతా మరియు భార్య ఖాతా ద్వారా ?38.62 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు.ట్రేడింగ్ జరుగుతున్న సమయంలో ప్రియా అతనికి ?1 కోటి లాభాలు వచ్చాయని చెప్పింది. కానీ, ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ముందు, ?18 లక్షలు ట్యాక్స్ క్లీయరెన్స్ పేరుతో డిమాండ్ చేసింది. బాధితుడు ఈ మొత్తం తన లాభాల నుంచి తీసుకోమని అడిగినప్పుడు, ఆమె దానికి అంగీకరించకుండా.. ట్యాక్స్‌ను వేరుగా చెల్లించాల్సిం దేనని చెప్పింది.ఇంకొక సంఘటనలో, హైదరాబాద్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని ఇండియామార్ట్ అనే వాణిజ్య వెబ్‌సైట్‌లో ట్రాన్స్మిషన్ లైన్‌టూల్స్ కోసం వెతుకుతున్న సమయంలో, మోసగాళ్లు 1,17,646కు మోసగించారు. ఎంటర్‌ప్రైజెస్ అనే పేరుతో పర్సనల్ జాయింట్ అకౌంట్‌కు చెందినట్లుగా తమను పరిచయం చేసుకున్నారు. బాధితుడికి ఫోన్లో మాట్లాడి పర్చేజ్ ఆర్డర్ పంపించారు.ఏప్రిల్ 5న ?1,17,646 చెల్లింపును బాధితుడు చేశాడు. అయితే అప్పటి నుంచి అతనికి ఎటువంటి సరుకు రాలేదు. ఫాలో అప్‌లో, మోసగాళ్లు వాట్సాప్ ద్వారా మరిన్ని నకిలీ రసీదులు, షిప్పింగ్ డాక్యుమెంట్లు పంపించారు.సిటీ సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి మాట్లాడుతూ, "బాధితుల ఫిర్యాదుల ఆధారంగా మోసగాళ్లను గుర్తించే పనిలో ఉన్నాం" అన్నారు. ఇలాంటి నేరు జరిగినప్పుడు వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు

# సిటిజన్ కానిస్టేబుల్స్...

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** రాంగ్‌రూట్‌లో వెళ్తే ట్రాఫిక్ పోలీస్ ఫోటో కొట్టి ఫైన్ వేయడం మనకు తెలిసిన విషయమే. అయితే ఎక్కడైనా ట్రాఫిక్ పోలీస్ లేడని తెలిస్తే మాత్రం వాహనదారులు మొత్తం ఇష్టం వచ్చినట్లు వెళ్తూ ఉంటారు. రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు కారణమైన వారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అందుకే ఇప్పుడు ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులను ఎవరైనా ఫోటో తీసి పంపిస్తే.. అలాంటి వారికి జరిమానాలు వేసే నిర్ణయం తాజాగా అమల్లోకి వచ్చింది.హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ వాహనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అదే సమయంలో ట్రాఫిక్ కూడా నిత్యం పెరుగుతూనే ఉంది. ఇక ట్రాఫిక్ ఉల్లంఘించి వెళ్లే వాహనదారుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. దీంతో ఎక్కడికక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు.. అందులో రాంగ్ రూట్ కారణంగా జరిగే ప్రమాదాలు, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారుల భరతం పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్తే వారికి జేబులు చిల్లులు పడేలా ఫైన్లు వేస్తున్నారు. అయితే ఇదంతా ట్రాఫిక్ పోలీసులు ఉండే జంక్షన్ల మాత్రమే ఇప్పటివరకు ఉండేది. కానీ ఇక నుంచి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి రాంగ్ రూట్ డ్రైవింగ్ లేకుండా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.ఇందులో భాగంగానే ట్రాఫిక్ పోలీస్ లేని ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారుల ఫోటోలు తీసే అధికారాన్ని సాధారణ ప్రజలకు, వాహనదారులకు కల్పించారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్లినట్లు గమనిస్తే.. వారి వాహనం ఫోటో తీసి తమకు పంపిస్తే.. అలాంటి వారికి ఫైన్లు విధిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువ చ్చారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ఆసక్తికరమైన ట్వీట్ పెట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాల ఫోటోలు, వీడియోలు తీసి పంపాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఫోటోలు వీడియోలను తమ వాట్సాప్ నెంబర్ 9490617346కు పంపించాలని.. వాటితోపాటు ఆ వాహనం లోకేషన్, టైమ్, డేట్ వంటి పూర్తి వివరాలను పంపించాలని ట్వీట్‌లో సూచించారు. పంపిన వివరాల ను సేకరించి.. ట్రాఫిక్ నియమాలను అతిక్రమిం చి.. రాంగ్‌రూట్‌లో వెళ్లిన వాహనదారులకు జరిమానాలు విధించి.. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముక్కుపిండి వసూలు చేయనున్నా రు. మే 1వ తేదీ నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణాలు చేయకుండా ఉ ండేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఈ రూల్‌కు సంబంధించిన ట్వీట్‌కు నెటిజన్లు మద్దతు తెలుపుతూ రీట్వీట్లు, కామెంట్లు చేస్తున్నారు.

# టచ్ మీ నాట్ గా పవన్

**గుంటూరు, తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజ కీయాలను బాగానే అలవర్చుకున్నారు. టచ్ మి నాట్ గా ఉండటానికి అనేక కారణాలున్నాయంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి కనుచూపు మేరలో బాగుపడే అవకాశం కనిపించడం లేదు. అప్పులు చేయాలి. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేయాలన్నా, నాలుగేళ్ల పాటు కొనసాగించాలన్నా చాలా కష్టమే. ఇప్పుడు సహకరించినట్లు కేంద్ర ప్రభుత్వం భవిష్యత్ లో సహకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే దాని పరిమితులు దానికి ఉంటాయి. ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ మరింత టైట్ చేసే అవకాశం కేంద్రంలో కనిపిస్తుంది. తనపరిమితమవుతూ.. అందుకే పవన్ కల్యాణ్ ప్రతి విషయంలో పూనుకుని తిరగకుండా తన శాఖకే పరిమితమవ్వాలని నిర్ణయించుకున్నారు. కూటమి ప్రభుత్వమని అంటున్నా అది పూర్తిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడానికే వదిలేశారు. అంటే మంచి జరిగినా, చెడు జరిగినా అది చంద్రబాబు నాయుడు ఖాతాలోకే వెళుతుంది. అమరావతి విషయాన్ని తీసుకుంటే ఇంత నిధులు పెట్టి ఎందుకు ఖర్చు చేయడం అన్న ప్రశ్న జనసేనానిలోనూ ఉంది. కానీ అదే అమరావతి సక్సెస్ అయితే? అదే సంపద సృష్టించే కేంద్రంగా మారితే? అందుకే ఆయన ప్రతి విషయంలో మౌనం పాటించినట్లే రాజధాని అమరావతి నిర్మాణం విషయంలోనూ మౌనంగా ఉండాలని నిర్ణయించారట. మళ్లీ భూసేకరణపై... ఇటీవల చంద్రబాబు నాయుడు అమరావతి రైతులతో సమావేశమై మరో నలభై నాలుగు వేల ఎకరాల సమీకరణను చేయాలని, గ్రీన్ కోర్ ఎయిర్ పోర్టుతో పాటు అనేక వాటికి భూమి అవసరమని ఆయన రైతులతో చెప్పారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తొలుత సేకరించిన 33 వేల ఎకరాలే ఎందుకని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ దానికి తోడు నలభై నాలుగు వేల ఎకరాలు సేకరించాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని కూడా తప్పుపట్టలేదు. అలాగే బహిరంగంగా సమర్థించలేదంటు



న్నారు. మనకు సంబంధం లేని విషయంగా ఆయన వ్యవహరి స్తున్నట్లే కనపడుతుంది. భవిష్యత్ లో బూమ్ రాంగ్ అయినా తాను సమర్థించలేదని చెప్పుకోవడానికి వీలవుతుందని సైలెంట్ గా ఉన్నారనిపిస్తుంది. . ఎంత సింహాచలం ఘటనపై... ఒక్క అమరావతి మాత్రమే కాదు.. ఏ ఘటన జరిగినా పెద్దగా ఆయన స్పందించడం లేదు. తిరుమలలో తొక్కిసలాట జరిగినప్పుడు అక్కడకు వెళ్లి ఊగిపోయిన పవన్ కల్యాణ్ నిన్న సింహాచలంలో గోడకూలి ఏడుగురు మరణిస్తే అక్కడకు వెళ్లకపోవడానికి కూడా కారణమదే అంటున్నారు. తాను అక్కడకు వెళితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాల్సి వస్తుందని, అందుకే అక్కడకు వెళ్లకుండా కామ్ గా ఉండి జరిగిన ఘటనను మాత్రం ఖండించారు. విచారాన్ని వెలిబుచ్చారు. పైగా హోంమంత్రి వంగలపూడి అనితను కూడా అక్కడ ఘటన జరిగిన తర్వాత తీసుకున్న చర్యలపై ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. దీన్ని బట్టి పవన్ కల్యాణ్ కొంత దూరంగా ఉ ంటూనే పరిస్థితిని బట్టి తన మూవ్ అవ్వాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుందని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

# మాయం కానున్న మూసీ మురుగు



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ప్రాజెక్టును చేపట్టింది. రూ. 3,100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్లు నిర్మించనున్నారు. 80 శాతం మురుగు మూసీలోకి చేరుతుండటంతో.. 39 అదనపు ఎస్టీపీలను నిర్మించనున్నారు. నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరం, దక్షిణం వైపు ట్రంక్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు.హైదరాబాద్ నగరవాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించిం ది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీ సీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా రు.త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి.. లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది.గతంలో జంట జలాశయాల నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైం ది.ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉ ండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మిం చాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్‌డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనా లను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బొబ్బిలి యుద్ధంలో నెగ్గిన కూటమి

**విజయనగరం,, తెలంగాణ దిశ :** విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు కూటమి నేతలు. అందుకోసం పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకున్నారు. ఎలాగైనా మున్సిపల్ పీఠం దక్కించుకోవాలని కూటమి నేతలు, తమ పీఠాన్ని పదిలపరచుకోవాలని వైసీపీ నేతలు ఎవరికి వారే పక్కా స్కెచ్ తో క్యాంప్ పొలిటికల్స్‌కి తెరలేపినా చివరికి కూటమి నేతలే నెగ్గారు. ఈ అంశంతో విజయనగరం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా రసవత్తరంగా మారాయి.నాలుగేళ్ల క్రితం వైసీపీ దక్కించుకున్న బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవిని ఇప్పుడు అధికార కూటమి దక్కించుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీపై ఎలాగైనా తమ జెండా ఎగురవేయాలని కూటమి చేసిన ప్రయత్నం సక్సెస్ ఫుల్ గా నెరవేరింది. అవిశ్వాసానికి కావలసిన మ్యాజిక్ ఫిగర్ ను సొంతం చేసుకునేందుకు ముందుగానే వైసీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానంలో చైర్మన్ కు వ్యతిరేకంగా 20 మంది ఓటేస్తే వైసీపీ చైర్మన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. అనంతరం 16 మంది చేతులెత్తి కొత్త చైర్మన్ ను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.బొబ్బిలి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 31 వార్డులుండగా, వాటిలో పది వార్డులను టీడీపీ, 20 వైసీపీ, ఒక వార్డు ఇండిపెండెంట్ కైవసం చేసుకున్నారు. అయితే ఆ తరువాత ఒక వైసీపీ సభ్యుడు రాజీనామా చేయడంతో బొబ్బిలిలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు.

# ఆ నేతలు ఇద్దరు ఆల్ హ్యాపీసేనా..!

**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :** మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మధ్య రేగిన వివాదాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మలుపు తిప్పారు. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీ సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కూటమి పార్టీలోని ఇద్దరు నేతలతో సమావేశమయ్యారు.వారిద్దరితో అసలేం మాట్లాడారో..? ఎలా సర్ది చెప్పారో కానీ, రెండు రోజుల క్రితం చిర్రుబుర్రులాడిన గంటా.. ఎమ్మెల్యే విష్ణుతో చేతులు కలిపారు. దీంతో ఆ ఇద్దరి మధ్య చెలరేగిన వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లేనని చర్చ జరుగుతోంది. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణంరాజు తొలి సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో రఘురామతోపాటు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు, జగన్మోహన్, కొణతాల రామకృష్ణ సభ్యులుగా ఉన్నారు. అయితే రెండు రోజుల క్రితం విశాఖ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు గంటా, విష్ణుకుమార్ రాజు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే.ఇది జరిగిన రెండు రోజులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ ఎంట్రీతో ఆ ఇద్దరి మధ్య గొడవకు శుభం కార్డు పడిందని అంతా చెబుతున్నారు. కూటమిలో ఉంటూ విపక్షంలా వ్యవహరించడం సరికాదన్న రీతిలో ఇద్దరూ ఇప్పుడు ఒక్కటైపోయారంట. పార్టీలు వేరైనా కూటమిలో కలిసికట్టుగా ఉంటూ విశాఖ అభివృద్ధి కోసం పాటుపడాలని ఇద్దరు సీనియర్ నేతలు కోరుకుంటున్నారని జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.విశాఖ ఫిల్మ్ నగర్ భూముల లీజు విషయంలో స్థానిక ఎమ్మెల్యే గంటాకు తెలియకుండా బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మిగిలిన ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం పంపడం వివాదానికి దారితీసింది. ఈ అంశంపై విశాఖ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక సందర్భంగా కలుసుకున్న విష్ణు, గంటా.. ఫిల్మ్ నగర్ లీజుల విషయంపై బహిరంగంగా వాదులాడుకున్నారు. ఈ విషయంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పినా, గంటా తీవ్ర మనస్థాపంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.విశాఖ ఫిలింనగర్ క్లబ్ కు గత ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమికి సంబంధించి కలెక్టర్ ను కలిసి విష్ణుకుమార్ రాజు లేఖ ఇవ్వడంపై గంటా మండిపడ్డారట. తన సంతకం లేకుండా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశంపై కలెక్టర్ కు లేఖ ఎలా ఇస్తారంటూ విష్ణుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారట.దీనిపై విష్ణుకుమార్ రాజు స్పందిస్తూ?ఫిల్మ్ క్లబ్ కు కేటాయించిన భూమి అలాట్ మెంట్ లెటర్లో 33 ఏళ్లు అనేది మిస్సయ్యిందని?దీనిపై కరెక్షన్ చేయడానికే కలెక్టర్ ని కలిసి లేఖ ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సంతకం తీసుకుని కలెక్టర్ కి ఇవ్వాలని..అలా జరక్కపోవడంతో గంటాకు విష్ణు సారీ కూడా చెప్పారట. దీంతో ఇద్దరి మధ్య తలెత్తిన విబేధాలు, రఘురామ ఎంట్రీతో సద్దుమణిగినట్టేనని అంటున్నారు. విష్ణు వర్సెస్ గంటా మధ్య గొడవలు ఇప్పటివి కావని..ఎప్పటినుంచో ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోందన్న చర్చ విశాఖ జిల్లా రాజకీయాల్లో నడుస్తోంది. ఎందుకంటే విశాఖ ఉత్తర నియోజకవర్గానికి విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యే. దాన్ని ఆయన కంచుకోటగా మార్చుకున్నారు. 2014లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ–బీజేపీ అభ్యర్థిగా రాజు గెలుపొందారు.ఆనాటి నుంచి నియోజకవర్గంలో ఆయనకు మంచి సంబంధాలే ఉన్నాయట. 2019లో అదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు, టీడీపీ నుంచి గంటా, వైసీపీ నుంచి కేకేరాజు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గంటా విజయం సాధించారు. ఆ తర్వాత గంటా, రాజుకు మధ్య మాటలయుద్ధం తారస్థాయిలో ఉండేదట. ఒకరినొకరు ముఖం చూసుకోని స్థాయికి వెళ్లిపోయాయని వారి సన్నిహితుల మధ్య టాక్ విన్పిస్తోంది.అయితే, నిన్నటి వరకు కయ్యానికి కాలుదువ్విన ఇద్దరు నేతలు..ఇప్పుడు ఆల్ హ్యాపీస్ అంటూ చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నా, లోలోపల మాత్రం మంట రగులుతూనే ఉంటుందని ఆ నియోజకవర్గం నేతలు మాత్రం గుసగుస లాడుకుంటున్నారట. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో..ఇలాగే కలిసిమెలిసి ఉంటారా లేక మళ్లీ రోడ్డెక్కి రచ్చ చేస్తారా అనేది చూడాలి.

# ఆత్మనిర్భరత-ఎరువుల కొరత..!



ఎరువుల కొరత! దీనికి ఎవరిని తప్పు పట్టాలి? దేశంలో ఏం జరిగినా చివరికి సూర్యుడు తూర్పున ఉదయించినా, పడమర అస్తమించినా నరేంద్రమోడీ కారణంగానే జరుగుతోందని చెబుతున్నారు కదా! మరి ఎరువుల కొరతకు నెహ్రూ కారణమని చెబుదామా, కుదరదే !! కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం 2025 ఆగస్టు ఒకటవ తేదీ నాటికి యూరియా నిల్వలు 37.19 లక్షల టన్నులు ఉంది. అంతకు ముందు ఏడాది అదే తేదీతో పోలిస్తే 49.24 లక్షల టన్నులు తక్కువ. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తగినంతగా నిల్వ చేయని కారణంగా యూరియా కొరత తప్ప కేంద్రానిది తప్పేమీ లేదని చెప్పే బిజెపి నేతల ధైర్యానికి మెచ్చుకోవాలి! ఆంధ్రప్రదేశ్ కొత్తగా రెండింజన్ల పాలనలోకి వెళ్లింది. అక్కడ కూడా యూరియా రావాల్సినంత రాలేదని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రానికి మొరపెట్టుకున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారని ఎంతగా దాచిపెట్టినా వార్తలు వెలువడుతూనే ఉన్నాయి. గల్లీ నుంచి ఢిల్లీ నేతల వరకు బుకాయిస్తున్న బిజెపి నేతలవి నోళ్లా మరొకటా అని రైతులు అనుకుంటున్నారు.

దేశంలో యూరియా నిల్వలు అంతగా పడిపోవటానికి కారకులు ఎవరు? మోడీ సర్కార్ కాసుల కక్కుర్తే. పిసినారి వాళ్లకు కూడా ముందు చూపు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి అది కూడా ఉన్నట్లు లేదు. మే నెలలో టన్ను యూరియా దిగుమతి ధర నాలగు వందల డాలర్లకు అటూ ఇటూ ఉండగా ఇప్పుడు 530 ఉన్నట్లు వార్త. ఎవడబ్బ సొమ్మని రామచంద్రా అని కంచర్ల రామదాసు అన్నట్లుగా%ొ%తక్కువకు దొరికినప్పుడు కొనకుండా ఇప్పుడు దిగుమతులకు హడావుడి పడటం దేనికి? ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా పడతాయని వాతావరణ శాఖ చెప్పింది, అదే జరిగితే పంటల సాగు పెరుగుతుందని గ్రహించటానికి కేంద్రంలో వ్యవసాయం గురించి తెలిసిన వారు ఉంటేగా! ఇప్పుడు చైనా నుంచి అధిక ధరలకు దిగుమతి చేసుకొనేందుకు నిర్ణయించినట్లు చెబుతున్నారు, అది రావాలన్నా కనీసం నెలన్నర పడుతుందని వార్తలు. చేతి చమురు వదులుతున్నది, రైతాంగం నుంచి విమర్శలు సరేసరి. ప్రభుత్వాల నుంచి అనేక రాయితీలు పొందిన కాకినాడ నాగార్జున ఎరువుల కంపెనీ మామూలు యూరియా బదులు గ్రీన్ అమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేసి లాభాలు పొందుతున్నదని వార్త. ప్రభుత్వమే పట్టనట్లు ఉంటే ప్రైవేటు కంపెనీల గురించి చెప్పేదేముంది!

ఒక్క యూరియా విషయంలోనే కాదు అన్ని ఎరువుల పరిస్థితి కాస్త అటూ ఇటూగా అంతే. డిఏపి నిల్వలు గతేడాది 15.82 లక్షల టన్నులుండగా ఆగస్టు ఒకటి నాటికి ఈ ఏడాది 13.9 లక్షల టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 46.99 లక్షల టన్నులకుగాను 34.97 ల.టన్నులు, ఎంఓపి 8 లక్షలకు గాను 6.27 లక్షల టన్నులు ఉండగా సూపర్‌గా రైతులు పిలిచే ఎస్ఎస్‌పి మాత్రం గతేడాది కంటే స్వల్పంగా ఎక్కువగా నిల్వలు ఉన్నాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పలువురు ఎంపీలు ఎరువుల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. యూరియా తరువాత ఎక్కువగా వినియోగించేది డిఏపి. చైనా నుంచి 2023-24లో 22.28 లక్షల టన్నులు దిగుమతి చేసుకోగా మరుసటి ఏడాది 8.47 ల.టన్నులు, ఈ ఏడాది జులైలో కేవలం 97 వేల టన్నులు మాత్రమే దిగుమతి చేసుకున్నట్లు ఎరువులు, రసాయనాల సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లోక్‌సభకు రాతపూర్వక సమాధానంలో చెప్పారు. చైనా ప్రభుత్వ తనిఖీ నిబంధనలే దీనికి కారణమన్నారు. పోనీ ఇతర దేశాల నుంచి ఆమేరకు దిగుమతి చేసుకున్నారా అంటే అదీ లేదు. అసలు కారణం ఏమంటే అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా ధర పెరగటమే, ఆ మొత్తాన్ని సబ్సిడీ రూపంలో ప్రభుత్వం భరించాలి గనుక అసలు దిగుమతులే నిలిపివేశారు. ఇదీ రైతుల పట్ల నరేంద్రమోడీ సర్కార్ శ్రద్ధ. కేంద్ర మంత్రి సమాచారం ప్రకారమే 2024 ఏప్రిల్‌లో టన్ను డిఏపి దిగుమతి ధర 542 డాలర్లు కాగా 2025 జులైలో అది 800 డాలర్లకు చేరింది. మరోసారి 2022 నాటి పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. నాడు డిఏపి ధర టన్ను 900 నుంచి వెయ్యి డాలర్లు ఉండగా ఈ ఏడాది దాని తయారీలో కీలకమైన ఫాస్ఫరిక్ యాసిడ్ ధర 2025 జనవరి నుంచి మార్చి నెలలో 1,055 డాలర్లకు పెరగ్గా%ొ%జులై, సెప్టెంబరు మాసాలకు 1,258 డాలర్లకు పెరిగిందట. పులి మీద పుట్ర మాదిరి ధరలు పెరగటమే కాదు, మన రూపాయి విలువ పతనం కావటంతో అది కూడా అదనపు భారాన్ని మోపుతున్నది.

ఫాస్పేట్, పొటాష్, డిఏపి వంటి ఎరువుల దిగుమతి మీద ఎలాంటి ఆంక్షలు లేవు. వాటిని ప్రైవేటు వారు తయారు చేయవచ్చు లేదా దిగుమతి చేయవచ్చు. ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డా లోక్‌సభకు రాతపూర్వకంగా తెలిపిన సమాచారం ప్రకారం గత ఐదు సంవత్సరాలలో చూస్తే మూడు సంవత్సరాలు డిఏపి ఉత్పత్తి తగ్గింది. 2022లో 43.47, 2023లో 42.93, 2024లో 37.69లక్షల టన్నుల (ఐదేళ్ల నాటి స్థితి) చొప్పున ఉత్పత్తి జరిగింది. 2023 జూన్ ఒకటి నాటికి 33.2, 2024లో 21.6, 2025 జూన్ నాటికి నిల్వలు 12.4 లక్షల టన్నులకు తగ్గాయి. దీంతో అనేక ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్ లేదా అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. నరేంద్రమోడీ ఎంతో ముందు చూపుగల నేత, 2014లో నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించిన గొప్ప యోధుడని పొగుడుతున్నారు కదా! అన్నీ కాంగ్రెసే చేసిందనే బొమ్మరిల్లు డైలాగులు వల్లించటం తప్ప పదకొండేళ్లలో చేసిందేమిటి! ఎరువుల కొరత, అనిశ్చితికి పునాది కాంగ్రెస్ హయాంలో నూతన ఆర్థిక విధానాలలోనే పడింది. వాటిని మరింత సమర్థవంతంగా, వేగంగా అమలు జరుపుతున్నట్లు మోడీ చెప్పుకుంటున్నారు. చైనా నుంచి వస్తువులను చౌకగా దిగుమతి చేసుకొని తన పరిశ్రమలను అమెరికా మూసివేసింది లేదా పక్కన పెట్టింది. మన పాలకులు వారు కాంగ్రెస్ అయినా బిజెపి అయినా అదే విధంగా ప్రభుత్వ రంగ ఎరువుల పరిశ్రమలను పక్కన పెట్టారు (మూసివేసిన రామగుండం ఫ్యాక్టరీని తెరవటం తప్ప కేంద్ర ప్రభుత్వం కొత్తగా పెట్టింది లేదు). కోళ్లను పెంచటం ఎందుకు? గుడ్లు, మాంసం దిగుమతి చేసుకుంటే పోలా! అన్నట్లుగా.. పెట్టుబడి, కార్మికులు, వేతనాలు, ఒప్పందాలు ఇవన్నీ ఎందుకు దిగుమతి చేసుకుంటే పోలా! అని మన పాలకులు అటువైపు చూశారు. ప్రపంచంలో పరిస్థితులన్నీ ఒకే విధంగా ఉండవనే లోకజ్ఞానాన్ని కోల్పోయారు.

నేడు ప్రతిదీ రాజకీయాలతో ముడి పెడుతున్న తీరు ప్రపంచమంతటా ఉంది. అందుకే ఎవరి మీదా ఆధార పడకుండా స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం మరింత పెరిగింది. చైనాతో సాధారణ సంబంధాల పునరుద్ధరణకు పూనుకున్న తరువాత అక్కడి నుంచి ఎరువులదిగుమతికి అవకాశం దొరికిందనే వార్తలు వచ్చాయి. గాల్వన్ లోయ ఉదంతాల తరువాత మనదేశంచైనా యాప్‌లనిషేధం, పెట్టుబడుల మీద ఆంక్షలను విధించిన సంగతి తెలిసిందే. దీనికి తోడు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కలసి క్వాడ్‌గా చైనా వ్యతిరేకతకు పూనుకున్న సంగతి కూడా తెలిసిందే. దానికి ప్రతిగా చైనా మనం దిగుమతి చేసుకుంటున్న ఎరువులు, విలువైన ఖనిజాలు, విద్యుత్ వాహనాలకు అవసరమైన మాగెట్లు, ఇతర విడి భాగాల మీద ఆంక్షలు విధించటం బహిరంగ రహస్యం. ఇరుగు పొరుగు దేశాలతో మన జాగ్రత్తలో మనముండటం తప్పు కాదు గానీ మన స్వతంత్ర విదేశాంగ విధానంలో భాగంగా ఎవరితోనూ శతృత్వం పెంచుకోవాల్సిన అవసరం లేదు. మనం చర్చించుకున్నది ఎరువుల గురించి గనుక ఈ రంగంలో ముందుచూపు లేక కోట్లాది మంది రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం ఇబ్బందుల్లోకి నెట్టింది. మన ఆహార పంటల దిగుబడులు, భద్రతకూ ఈ వైఖరి నష్టదాయకం. జనం ఆలోచించాలి మరి!

## పలువురికి సన్మానం



**కమాన్ పూర్, తెలంగాణ దిశ :** కమాన్ పూర్ మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన సగర (ఉప్పరి) సంఘం అధ్యక్షులు రేవెల్లి శంకర్ మరియు ఉపాధ్యక్షులు పోతుల ప్రకాష్ లను అలాగే ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన సుభాష్ నగర్ యూత్ అధ్యక్షులు రేవెల్లి శివమరియు ఉపాధ్యక్షులు ధోని కెనా విజయ్ లను భారతీయ జనతా పార్టీ కమాన్ పూర్ మండల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కొయ్యడ సతీష్, పెద్దపల్లి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, జంగపల్లి అజయ్,ఇరుగురాల పోశం మల్లార అరుణ్ కుమార్, పెద్దపల్లి శ్యాంసుందర్, పంతకాని విశ్వతేజ, పిల్లి చంద్రయ్య, పిడుగు రమేష్, జంగపల్లి శ్రీనివాస్, ఆసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి..

### గోదావరిఖని ఏసిపి మడత రమేష్



**కమాన్ పూర్, తెలంగాణ దిశ :** విద్యార్థులపై తప్పకుండా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ సూచించారు.రా మగిరి మండలం బేగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఏసిపి రీడింగ్ చైర్స్ రైటింగ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతమైన ఉపాధ్యాయులు ఉంటారని మరోవైపు తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు.విద్యార్థులు మొబైల్ ఫోన్ తో పాటుగా ఫేస్ బుక్ వాట్సాప్ ఇంస్టాగ్రామ్ షేర్ చాట్ తదితర సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ లకు దూరంగా ఉండాలని అంతేకాకుండా ఏపీకే ఫైల్స్ లింక్స్ ఓటిపిల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. క్రమశిక్షణతో నేర్చుకున్న విద్య ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గర్వించదగిన వారందరూ అతి సామాన్యమైన కుటుంబం నుండి కష్టపడి చదువుకున్న వారేనని ఏసిపి మడత రమేష్ గుర్తు చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామ్ కిషన్ ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముఖ గుర్తింపు ద్వారా పింఛన్‌లు



**జయశంకర్, తెలంగాణ దిశ :** జిల్లాలోని పింఛన్ గ్రహీతలు ఇకపై బయోమెట్రిక్ ఆధారిత ఇబ్బందులు లేకుండా, తాము ఎక్కడ ఉన్నా సులభంగా ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందే అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో డిఆర్డిఎ ఆధ్వర్యంలో పోస్టు మాస్టరులకు పింఛను ఇవ్వడానికి అవసరమైన 89ముఖ గుర్తింపు పరికార్లను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు తదితర పింఛనుదారులకు ఇది ఎంతో ఉపయుక్తమని ఆయన అన్నారు. పింఛను చెల్లింపులో కొత్త పద్ధతిని ప్రారంభించామన్నారు. పౌరుల సౌకర్యార్థం ముఖ గుర్తింపు పేస్ రికగ్నిషన్ ఆధారంగా పింఛను చెల్లింపుకు ఉపయోగించే ఆధునిక పరికరాలు వినియోగించను న్నట్లు తెలిపారు. సాంకేతికతన వినియోగించడం ద్వారా పింఛను చెల్లింపులలో పారదర్శకత, వేగం పెరుగుతుందన్నారు. ముఖ గుర్తింపుతో పింఛను అందించగలిగే ఈ పరికరాలు జిల్లాలో ప్రతి పింఛనుదారునకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఆర్డీఓ బాల కృష్ణ, ఆర్డిఓ రవి తదితరులు పాల్గొన్నారు.



## గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం

### డాక్టర్ కళావతి బాయి




**ఖమ్మం, తెలంగాణ దిశ :** గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట విదద్ధమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి అన్నారు. కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళావతి బాయి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో జరిగే ప్రతి స్కానింగ్ కు సంబంధించి ఫారం ఎఫ్ రూపొందించి ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు ఖమ్మం జిల్లాలోజరిగే ప్రసవాలలో వెయ్యిమంది మగ పిల్లలకు 988 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థశిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేలు జరిమాన విధించబ డుతుందని,అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ అరికట్టుటకు ప్రతి నెల స్కానింగ్ సెంటర్ల ను తనిఖీలు చేస్తునమాని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులలో జరుగు తున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందా అని పరిశీలించాలని డిఎంహెచ్ఓ తెలిపారు. అధికంగా స్కానింగ్ జరిగే ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చేయకుండా ఉండే విధంగా చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని, లింగ నిష్పత్తి సమానమయ్యే దిశగా కృషి చేయాలని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ ద్వారా ప్రజల్లో ఆడపిల్ల అదృష్టమనే అవగాహనతో పాటు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. పోస్టర్లు, కరపత్రాల ద్వారా చట్టం పై అవగాహన, ఆడపిల్లలు మగపిల్లలతో సమానమేనని, అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో రాణిస్తారనే భావన వారిలో కల్పించాలని విస్తృత ప్రచారం చేయాలని, గర్భిణీ లపై అంగన్వాడీ, ఆశా లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కువగా 5, 6 వ నెలల్లో అబార్షన్ లకు అవకాశం ఉంటుందని, వీరు పరీక్షలకు వచ్చేలా ఫాలో అప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ఏడి కె. శ్రీనివాసరావు, డిఎంసి ఎస్డీ. సమ్రీన్, జాగృతి ఎన్జిఓ ఎం. కుముదిని తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసమే షీ టీంలు



**రామగుండం, తెలంగాణ దిశ:** మహిళల రక్షణ కోసమే సి టీం లో పనిచేస్తున్నాయని షీ టీం ఇంచార్జ్ స్నేహలత అన్నారు. రామగుండం సి.పిఆదేశాల మేరకు, 8 ఇంక్లైన్ కాలనీ లోని సింగరేణి హై స్కూల్ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్,ఎవరైనా చెడు గా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలాని, మరియు వాటి నుంచి ఎలా బయటపడటం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుం దని,ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయప డకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతు ందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్ మరియు , హెడ్ మాస్టర్ సుందర్ రావు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పనుల్లో నిర్లక్ష్యంపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు లేఖ




**మంథని, తెలంగాణ దిశ :** మంథని మున్సిపల్ పరిధిలోని అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని మంథని బిజెపి పట్టణం మాజీ అధ్యక్షుడు, ఆర్టిఏ యాక్టివిస్ట్ ఎడ్ల సదాశివ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిహెచ్ఎం ఈడికి లేఖ రాశారు. మంథని మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులలో భాగంగా జరుగుతున్న అధికారులు కనీస నియమ నిబంధనలు పాటించడం లేదని, వారు ఉపయోగించే వాహనాల మూలంగా ప్రజలకు ఏదైనా ప్రమాదం జరిగితే పూర్తి బాధ్యత వారిదే అని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యుత్ చౌర్యానికి కాంట్రాక్టర్లు పాల్పడుతున్నారని, ప్రభుత్వ నుండి సరైన అనుమతులు తీసుకోకుండా మట్టి రవాణా చేస్తున్నారని తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఓటరుతో ఆధార్ నమోదు చేయాలి




న్యూఢిల్లీ, : ఓటర్‌ను ఆధార్‌తో నమోదు చేయించే ప్రక్రియ జరక్కపోవడం, దానిని తప్పనిసరి చేయక పోవడంతో ఓటర్ల జాబితా ఎప్పుడూ గందరగోళానికి, విమర్శలకు గురవుతోంది. బీహార్ వ్యవహారంలో ఇది విమర్శలకు దారితీసింది. ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ అభిసు పాలయ్యింది. చివరకు సుప్రీం జోక్యం చేసుకునే పరిస్తితి వచ్చింది. విపక్షాలు ఆందోళనతో పార్లమెంట్‌ను స్తంభించ చేశాయి. ఈ క్రమంలో పక్కా ఓటరు నమోదు ప్రక్రియ అన్నది సవాల్‌గా తీసుకోవాలి. గతంలో ప్రతి ఒక్కరి ఫోన్‌లకు ఆధార్ నమోదు కోసం మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఓటరు కార్డుతో ఆధార్ నవోదు ద్వారా బోగస్ ఓట్లను అరికట్టాలని అధికారులు నిర్ణయించారు. ఒక వ్యక్తి ఒకే ఓటు హక్కు ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు ఆధార్ నవోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించినా అది ముందుకు సాగలేదు. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపినా, బీహారల్‌లో విమర్శల పాలయ్యింది. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తించి జాబితాను రూపొందించవచ్చు. జాబితా సిద్ధం కాగానే

## బోగస్ ఓట్ల ఏరివేత పక్కాగా సాగాలి

జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి వాటిని తొలగించేయాలి. ఇలా ప్రతి జిల్లాలో చర్యలు చేపట్టడం ముఖ్యం. దేశం యావత్తూ ఓట్ల నమోదు,ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొనసాగితే పంచాయితీ ఉ ఒడదు. చాలామంది నివాసాలు మారడంతో రెండు, అంతకుమించి చోట్ల ఓటుహక్కు ఉంటోంది. కొంతమంది పిల్లల చదువు, ఉ ద్యోగరిత్యా పట్టణాల్లో నివాసం ఉంటున్నారు. సొంత గ్రామాల్లో ఓటు హక్కుతో పాటు నివాసం ఉంటున్నచోట సైతం వీరు ఓటు హక్కు వినియోగంచు కుంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు మున్సిపాల్టీ ఎన్నికల్లో సైతం ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికి ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టాలి. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ సాఫ్ట్‌వేర్‌తో ఇటువంటి వాటికి చెక్ పెట్టే అవశం ఉంది. రెండు చోట్ల ఒకే ముఖ కవలికలు ఉంటే కొత్తగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వీరిని గుర్తించవచ్చన్నారు. ఇలా రెండుచోట్ల ఓటుహక్కు ఉన్న వారందరినీ గ్రామాలు, వార్డుల వారీగా గుర్తించవచ్చు. ఇలా రెండేసి ఓటరు జాబితాలో ఉన్న వారిని ఒక చోట ఓటు హక్కు తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలి. అలాగే ఇతరరాష్ట్రాల్లోక్రూడా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలి. ఓటరుకార్డు ఉన్న వారు ఫారం-6లో పూర్తి వివరాలు నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేస్తే వాటిని క్రోడీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నమోదు చేసిన వెంటనే ఓటరు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. వీటితో పాటు డబుల్ ఓటరు కార్డులున్న వారికి ఇప్పటికే సమాచారం అందించి తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తారు.

# డిజి.. కేరళం



సంజ్ఞలు, చిహ్నాల ద్వారా కమ్యూనికేషన్ సాధ్యమైన ఆదిమ కాలం నుండి ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీ రంగంలోకి అడుగుపెట్టాం. ఈ ఆధునిక కమ్యూనికేషన్%ౌ%కాంతి వేగంతో అభివద్ధి చెందుతోంది. అందువల్ల, రాబోయే కాలమంతా అనూహ్యమైన సమాచారం, కమ్యూనికేషన్ విస్ఫోటనంతో కూడుకున్నదని నిపుణులు చెబుతున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా అద్భుతమైన కమ్యూనికేషన్ విధానం ఇప్పటికే ఏర్పడింది. డిజిటల్ రంగం ఊహించలేనంత ఎత్తులకు ఎదుగుతూ, విస్తరిస్తున్నప్పటికీ, దానిలోని లోపాలూ అదే స్థాయిలో ఎదురవుతున్నాయి. వీటిలో అధికారిక, ఉ న్నత విద్యలోని అనేక దశలను అధ్యయనం చేసిన వారు, సమాజంలోని ఉన్నత స్థాయిల్లోనివారు ఉన్నారు. అక్షరాస్యత అనే పదానికి నిర్వచనం ఇక్కడ పెద్దదిగా మారుతోంది. మనం అక్షరాస్యతను రాతపూర్వక భాష సముపార్జన అని పిలుస్తున్నట్లుగానే, డిజిటల్ టెక్నాలజీ నేర్చుకున్న వారిని కూడా పిలుస్తున్నాం. ఇక్కడే కేరళ పూర్తి డిజిటల్ అక్షరాస్యతను సాధించడంలో ముందడుగు వేసింది. 'జ్ఞానం శక్తి' అని ఫ్రాన్సిస్ బేకన్ అన్నట్లే, నేటి ప్రపంచంలో డిజిటల్ జ్ఞానం అత్యంత శక్తివంతమైన ఆయుధంగా మారింది. ఈ సత్యాన్ని సమగ్రంగా గ్రహించి ముందడుగు వేసిన రాష్ట్రం కేరళ. సామాజిక పురోగతి, విద్య, ఆరోగ్య రంగాల్లోనే కాదు, ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యతలోనూ కేరళ దేశంలోనే ఒక మోడల్ రాష్ట్రంగా నిలుస్తోంది.'అక్షరాస్యత స్వేచ్ఛకు ద్వారం. డిజిటల్ అక్షరాస్యత ఆధునిక స్వేచ్ఛకు మార్గం' అంటారు విద్యావేత్త కె.జి.సత్యన్. 1991లో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించిన కేరళ, ఇప్పుడు వంద శాతం డిజిటల్ అక్షరాస్యతను సాధించిన తొలి రాష్ట్రంగా కూడా తన రికార్డును తానే అధిగమించింది. దేశంలో 38శాతం కుటుంబాలే డిజిటల్ అక్షరాస్యత సాధించగా, కేరళ మాత్రం సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను సాధించి, తన ప్రత్యేకతను నిలుపుకొంది. కరోనా సమయంలో పుల్లంపారా అనే గ్రామ పంచాయతీ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమై, రాష్ట్రమంతా విస్తరించి.. 'డిజి-కేరళం'గా రూపుదిద్దుకుంది. సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్‌ను ఎలా వెలిగించాలి దగ్గర మొదలై%ౌ% కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ ఎలా వాడాలి, ఎలా టైప్ చేయాలి, వాటిని నిత్య జీవితంలో వివిధ పనులకు ఎలా వినియోగించాలనే అంశాల వరకు ఈ శిక్షణ శిబిరాల్లో నేర్పించారు. వయసు, విద్యార్హత, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తినీ డిజిటల్ అక్షరాస్యుడిగా మార్చాలన్న లక్ష్యంతో కేరళలోని వామపక్ష ప్రభుత్వం 'డిజి-కేరళం' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 14ఏళ్ల పైబడి, డిజిటల్ పరిజ్ఞానం లేని దాదాపు 22లక్షల మందిని గుర్తించి, శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం రాష్ట్ర ఆర్థిక, గణాంక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ అక్షరాస్యత పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణులు కానివారికి తిరిగి శిక్షణ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతం చేయడంలో 2.57లక్షల మంది వలంటీర్లు కీలకపాత్ర పోషించారు. డిజిటల్ అక్షరాస్యత భవిష్యత్ సమాజపు పునాది. పుస్తక అక్షరాస్యతలో కేరళ ఖ్యాతిగాంచినట్లే, ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యతలోనూ దేశానికి ఆదర్శంగా నిలిచింది. డిజిటలైజేషన్ అనేది భౌతిక-వర్చువల్ ప్రపంచాలను కలిపే వారధి. ప్రపంచానికి మనల్ని దగ్గర చేస్తుంది%ౌ% మన పరిధులను విస్తరిస్తుంది. ఇది గొప్ప ఈక్వలైజర్. వ్యక్తులకు వారి వారి నేపథ్యం, పరిస్థితులతో సంబంధం లేకుండా అభివృద్ధి చెందడానికి, విజయవంతం కావడానికి అవకాశాలను అందిస్తుంది. కేరళ ప్రభుత్వం కూడా అదే చేసింది. డిజిటల్ నిరక్షరాస్యులను గుర్తించి, వారిని డిజిటైజ్ చేసి, ప్రపంచం మన చేతివేళ్ల దగ్గరే వుందన్న ఆలోచనకు బీజం వేసింది. 'డిజిటల్ టెక్నాలజీ కేవలం ఒక సాధనం మాత్రమే కాదు, పురోగతికి ఉత్ప్రేరకం%ౌ% కొత్త అవకాశాలకు ప్రవేశ ద్వారం' అంటారో సాంకేతిక నిపుణుడు. కేరళ చూపుతున్న ఈ దారి, భారతదేశం డిజిటల్ సమానత్వం వైపు నడిచేందుకు ఒక మార్గాన్ని సుగమం చేసింది. కేరళ మాదిరిగా టెక్నాలజీని ప్రజల చేతుల్లో పెట్టే దిశగా దేశంలోని ప్రతి రాష్ట్రమూ అడుగులు వేయాల్సిన అవసరం వుంది. అక్షరాస్యతను, డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహిస్తూ ప్రజల్ని డిజిటల్ యుగం వైపునకు నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలి.

# వార్నింగ్ లతో దారికొచ్చేనా?

**విజయవాడ, తెలంగాణ దిశ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కసి మీద ఉన్నారు. పార్టీ నేతల మధ్య విభేదాలను తొలగించేందుకు ఆయన నేరుగా రంగంలోకి దిగుతున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో నేతల మధ్య తగాదాలను పరిష్కరించాలన్న భావనలో ఉన్నారు. నేతల మధ్య తలెత్తుతున్న విభేదాలు చివరకు పార్టీ ఉనికికే ప్రశ్నార్థకంగా మారనున్నాయి. క్యాడర్ కూడా రెండుగా విడిపోవడం వల్ల ప్రత్యర్థులు లాభపడతారు. ఆ అవకాశం ఇవ్వకూడదన్న విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకే ఎక్కడ ఏ చిన్న వివాదం తలెత్తినా ఆయన నేరుగా ఎంట్రీ ఇచ్చి విభేదాలను పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. నివేదికలు కోరుతున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో... అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అక్కడ ప్రభాకర్ చౌదరికి, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కు మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. సీటు దక్కకపోయినా తాను దగ్గుబాటి ప్రసాద్ విజయం కోసం పనిచేసినా గెలిచిన తర్వాత తన అనుచరులను అణగదొక్కుతున్నారన్న అభిప్రాయం ప్రభాక్ చౌదరిలో ఉంది. అదేసమయంలో ఆయన జూనియర్ ఎన్టీఆర్ సినిమాపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారి పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. రాష్ట్రంలోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులంతా ఏకమై అనంతపురం ఎమ్మెల్యే నివాసం ఎదుట ఆందోళనకు దిగారు. దీని వెనక ప్రభాకర్ చౌదరి ఉన్నారంటూ దగ్గుబాటి ప్రసాద్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరినీ పిలిచి చంద్రబాబు నాయుడు క్లాస్ పీకినట్లు తెలిసింది. ...ఎమ్మెల్యేలకు, కొందరు మంత్రులకు వార్నింగ్ కూన రవికుమార్ విషయంలోనూ... ఇక శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. ఆయనకు అక్కడ మంత్రి అచ్చెన్నాయుడుకు మధ్య పొసగడం లేదు. అదే సమయంలో తాజాగా ఒక ప్రిన్సిపల్ బదిలీ వివాదంలో కూన రవికుమార్ చిక్కకున్నారు. ప్రిన్సిపల్ ఆత్మహత్యాయత్నం చేయడంతో అది పార్టీకి ఇబ్బందికరంగా మారింది. కూన రవికుమార్ కొంత దూకుడుగా ఉంటారు. ఇసుక దందాలు, కేజీబీవీ ప్రిన్సిపల్ సౌమ్య వివాదంతో ఆయన పార్టీని ఇబ్బందుల పాటు చేస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన కూన రవికుమార్ కు కనీసం కేబినెట్ ర్యాంక్ పదవి దక్కకపోవడంతో ఆయన అసహనంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కూన రవికుమార్ నుంచి కూడా చంద్రబాబు నివేదికను కోరినట్లు తెలిసింది. దీనిపై త్వరలో కూనను పిలిచి చంద్రబాబు మాట్లాడతారని తెలిసింది. చదవకుండా సంతకాలు పెట్టేస్తారా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి వర్గ సమావేశంలో మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫైళ్లను పరిశీలించి దానిపై సంతకం చేయాలని అన్నారు. అధికారులు మాటగా కాకుండా లోతుగా అధ్యయనం చేయాలని, ఫైలు పూర్వాపరాలను కూడా తెలుసుకుని క్లియర్ చేయడం మంచిదని సూచించినట్లు తెలిసింది. అలాగే తమకు ఇన్ ఛార్జి పదవి అప్పగించిన జిల్లాల్లో ఎమ్మెల్యేల పనితీరును కూడా గమనించాలని ఆయన కోరినట్లు తెలిసింది. కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలి పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా తయారైందని, వారిని కంట్రోల్ చేసే బాధ్యత మంత్రులు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ప్రధానంగా ఎమ్మెల్యేలు తీరు మార్చుకోకుంటే తానే స్వయంగా జోక్యం చేసుకోక తప్పదని హెచ్చరించినట్లు తెలిసింది. తప్పు చేసిన వారు ఎవరైనా వదిలేదిలేదని, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలని, జనంలో ఉండాలని, అంతే తప్ప నిత్యం వివాదాల్లో కాదన్న విషయం గుర్తుంచుకోవాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న విపక్షాలు జనంలోకి తీసుకెళ్లి పార్టీతో ప్రభుత్వం కూడా అభాసుపాలు జేసేలా వ్యవహరి స్తారని చంద్రబాబు అన్నారు. అలాగే మహిళల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని, ప్రభుత్వ సిబ్బంది, అధికారుల పట్ల మర్యాదపూర్వకంగానే వ్యవహరించాలని, ఏదైనా తప్పు జరిగితే అది ఎత్తి చూపే అవకాశం వేరే మార్గాల ద్వారా ఉంటుందని ఆయన అభిప్రాయపడినట్లు తెలిసిం ది. సోషల్ మీడియా ప్రజల్లోకి విస్తృతంగా వెళుతున్న ఈ సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా నష్టం వాటిల్లేది వ్యక్తిగతంగా మాత్రమే కాదని, కూటమి ప్రభుత్వానికి అని గుర్తుంచుకోవాలని చంద్రబాబు సీరియస్ గా వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. రోడ్డు మీద కువచ్చి దాడులు చేసే సంస్కృతి ఏంటని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం.

ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని,పార్టీ పరంగా కాకుండా భవిష్యత్ లో వారికి రాజకీయం చేసేందుకు కూడా అవకాశం ఉండదని ఒకింత గట్టిగానే చంద్రబాబు నాయుడు హెచ్చరించినట్లు చెబుతున్నారు. మొత్తం మీద మంత్రి వర్గ సమావే శంలో చంద్రబాబు లైన్ దాటుతున్న ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం

# ప్రజల ప్రాణాలనుకాపాడేందుకు కలిసి శ్రమిద్దాం..

## జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, తెలంగాణ దిశ:** 26 జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రోడ్డు భద్రతకు సంబంధించి, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మోటారు వాహనాలు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్ పాటించక పోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల భారిన పడిన వారి కుటుంబ సభ్యులు అనాధలవుతు న్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, ఆర్ అండ్ బీ, వైద్యశాఖల అధికారులు సమన్వయం తోపనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసుశాఖనుఆదేశించారు.జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు రబ్బరు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ఆదేశించారు. రహదారుల కూడళ్లు, ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో శ్రమిద్దామని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ చందన, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఇల్లందు శ్రీకాంత్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీవో వెంకటరమణ, కొత్తగూడెం నేషనల్ హైవే డి ఈ శైలజ, మెడికల్ డిపార్ట్మెంట్ వీరబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# మేలుకోరే వారే నిస్వార్థులు

**తిరుమల, తెలంగాణ దిశ :** మంచి చెప్పేవారే మనవారు. మన మేలుకోరేవారు నిస్వార్ధపరులు. మనం చెడిపోతే సంతోషించేవారు స్వార్థపరులు. ఇలాంటివారిలోనే అహంకారం నిండి ఉంటుంది. ఫల్గుణుడు, శ్రీకృష్ణుడు ఎంతోకాలం సన్నిహితులుగా మెలిగారు. రణరంగం మధ్యలో రథాన్ని నిలిపి గీతను బోధిస్తున్నప్పుడు పార్ధసారథి తన చెలికాడే కదా... ఈయన చెప్పేది తానెందుకు వినాలని కౌంతేయు డు భావించి ఉంటే బహుశా మహాభారత -యుద్ధం సంభవించేదే కాదేమో! ధీరులు అంటే కండబలం ఉన్నవారు కానేకాదు. సమర్థులై, వివేకం కలిగినవారే ధీరులు. సమర్థత ఉంటే కార్యసాధకులవుతారు. అశోకుడి జీవిత చరిత్ర గమనిస్తే చకితులం అవుతాం. కండ బలంకన్నా అతడి మస్తిష్కం గొప్పది. అందువల్ల అతడెన్నో యుద్ధాలను జయించగలిగాడు. అతడి బలహీనత రాజ్యకాంక్ష. ఆలోచనలు మాత్రం గొప్పవి. జయాపజ యాలు ఇహానికి సంబంధించినవని శాంతిలోనే ధర్మం ఉందని గ్రహించాడు. అందుకే కళింగ యుద్ధంలో విజయం సాధించిన అనంతరం వివేకం మేలుకొని గౌతమ బుద్ధుడు చెప్పిన పథంలో నడిచాడు.

# సమస్యలపై చర్చించే చిత్తశుద్ధి ఏదీ..!

పార్లమెంటులో సమస్యపై ఎలా చర్చించాలన్న వ్యూహం కనబడడం లేదు. తాము వాయిదా తీర్మానాలు ఇస్తే చర్చ జరగాల్సిందే అన్న ధోరణిలో విపక్షలు ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇది కుదరదు. వాయిదా తీర్మానాలు లేకున్నా అసవరమైన సందర్భాల్లో రూల్ పొజిషన్‌ను బట్టి సమస్యలపై చర్చకు అవకాశం ఉంది. దీనిని ఉపయోగించుకోవడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. ఎందుకంటే ఐదురోజులుగా పార్లమెంట్ ఎలాంటి కార్యలాపాలు లేకుండా సాగుతోంది. అనేక అంశాలు చర్చించాల్సి ఉంది. వారు కోరుకుంటునన బీహార్ ఓటరల్ జాబితాయే గాకుండా అనేక అంశాలు ఉన్నాయి. వాటిని ఎలా చర్చించాలో ప్రణాళిక లేకుండా పోతోంది. తమ గొంతు నొక్కుతున్నారని విపక్షనేత రాహుల్ చెప్పడం సిగ్గుచేటు.రూల్ ప్రకారం పోతే ప్రభుత్వమే దిగివస్తుంది. చచ్చినట్లు అంశం ఏదైనా చర్చిస్తారు. సమాధానం ఇస్తారు. అలా చేయడంలో విపక్ష పార్టీలో విఫలం అవుతున్నాయి. కేవలం వాయిదా తీర్మానాలు ఇవ్వడం, సభను అడ్డుకోవడం, బయటకు వచ్చి మీడియాతో మాట్లాడడం మాత్రమే చేస్తున్నారు. నిజానికి జాతీయ జలవిధానం, నదుల అనుసంధానం, రైతుల సమస్యలు చర్చించడానికి సమయం కావాలి. వీటిని ఎజెండగా చేసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్దంగా ఉంటున్నారు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరిం చడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా ధరలు రాక నష్టపోతున్నారు. వీటికితోడు భారీ వర్షాలు దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరు తోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిలో అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. పార్లమెంటులో ఇలాంటి సమస్యలు చర్చకు రావడం లేదు. ఎంతసేపు ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప సమస్యలపై ఎంపిలకు అవగాహన లేకుండా పోతోంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు తగ్గించుకుని మన రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించు కోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకో వాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ రంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడిముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. రైతులనే ప్రోత్సహించి పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలపై చర్చ చేయాలి. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ వాగ్దానాన్ని నెరవేర్చగలగాలి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ విధానాలనే పార్లమెంటులో చర్చించడం లేదు. రాజకీయ పార్టీల ప్రాధాన్యాలు మారాలి. ప్రజల సమస్యలను ఎంచుకున ముందకు సాగితేనే మంచిది.

# మార్వాడీ గో బ్యాక్.. ఉద్యమం దారెటు...




హైదరాబాద్, : తెలంగాణలో మార్వాడీ వ్యతిరేక ఆందోళనలు, దానిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. మార్వాడీ వ్యాపారుల వల్ల గ్రామీణ తెలంగాణలోని చిరు వ్యాపారులు నష్టపోతున్నారంటూ కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అదే సమయంలో ఈ ఆందోళన వ్యాపార పరిధిని దాటి రాజకీయ, మత పరమైన అంశంగా మారింది.ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణ వ్యాపారులు బంద్ పిలుపునివ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, తరువాత వారు ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. కొన్నేళ్లుగా సోషల్ మీడి యాలో తెలుగునాట గ్రామీణ ప్రాంతాల్లో మార్వాడీ దుకాణాల పెరు గుదల గురించి చర్చ నడుస్తూ ఉండేది. గత మూడు-నాలుగు వారా లుగా అది తీవ్రమైంది.అదే సమయంలో సికింద్రాబాద్‌లో జరిగిన ఓ పార్కింగ్ వివాదంలో మార్వాడీ వ్యక్తులు స్థానికులను కొట్టారని పగిడిపల్లి శ్యాంసన్ అనే ఆందోళనకారుడు ఆరోపణలు చేయడం, పిడమర్తి రవి వంటి ఒకప్పటి తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు ఈ అంశంపై ప్రసంగాలు ఇవ్వడం, వీటికి సంబంధించిన వార్తలను సోషల్ మీడియా వేదికగా కొందరు షేర్ చేయడం.. మార్వాడీలను ఘాటుగా విమర్శిస్తూ గోరేటి రమేశ్ అని వ్యక్తి పాట విడుదల చేయడం.. ఇవన్నీ ఈ చర్చను పెంచాయి.ఆమనగల్లు వ్యాపారుల బంద్ ప్రకటనతో ఇది తారస్థాయికి చేరింది. కాంగ్రెస్, బీజేపీలూ దీనిపై స్పందించాయి. ఆ క్రమంలో అంతే దీటుగా ఈ ఆందోళనలకు వ్యతిరేకంగా, మార్వాడీలకు మద్దతుగా హిందుత్వవాదులు మాట్లాడడం ప్రారంభమైందిహిందుత్వ రాజకీయాలను వ్యతిరేకించే కొందరు మార్వాడీ వ్యతిరేక ఆందోళనలకు మద్దతిస్తున్నారు."స్టాకిస్ట్, డీలర్, రీటెయిలర్.. అన్నీ మార్వాడీలే అయ్యారు. స్థానిక వ్యాపారులు వారితో కష్టంలో, తెలివిలో పోటీ పడగలరు కానీ మోసంలో పడలేరు. సొంత ఊరి కస్టమర్లను మార్వాడీల్లాగా మోసం చేయలేరు. వారి వల్ల ఆర్థిక వ్యవస్థలే దెబ్బతింటున్నాయి" అంటూ మార్వాడీలపై తీవ్రమైన ఆరోపణలు చేశారు ఆమనగల్లు వ్యాపారుల సంఘం అధ్యక్షు డు తిరుపతయ్య.ఆమనగల్లు వ్యాపారుల సంఘం చేసిన ఆరోపణలను స్వతంత్రంగా పరిశీలించలేదు.ఆ ఆరోపణలను మార్వాడీ సంఘాల వారు ఖండించారు.దుకాణాల అద్దెల ధరలు కావాలనే బాగా ఎక్కువ చెల్లిస్తున్నారు. దీంతో చిన్న వ్యాపారులకు దుకాణాలు దొరకక్క నష్టపోతున్నారు. స్థానిక వ్యాపారులపై కిరాయి, అద్దెల భారం పెరిగిపోతోంది.వెయ్యి జనాభా ఉండే పల్లెల్లో నాలుగైదు చిన్న చిన్న దుకాణాలు ఉండేచోట, వీరు భారీ హంగులతో షాపులు పెడుతున్నారు. అక్కడ మొదట్లో చవకగా వస్తువులు అమ్మి, ఇతరవ్యాపారులను దెబ్బతీస్తున్నారు. సప్లై చైన్ మొత్తం వారి వర్గమే ఉండడం వల్ల వారికి వస్తువులు తక్కువకు దొరుకుతాయి. బ్రాండెడ్ లాగానే కనిపించే నకిలీ వస్తువులూ వారు అమ్ముతారు.భారీ ఆర్థిక వనరులతో వ్యాపారాలు ప్రారంభిస్తారు. తక్కువ వనరులతో ప్రారంభించిన చిన్నవ్యాపారులు ఆ పోటీ తట్టుకోలేరు. పద్మశాలీ, కోమటి వారి షాపులు మూతపడుతున్నాయి.అక్కడి పనిచేయడానికి స్థానికులను పెట్టుకోరు. ఫ్యాన్సీ, చెప్పులు, స్టీల్.. ఇలా అన్నిట్లో వారే వస్తున్నారు.కర్ణాటక ఉడుపి హోటెళ్లున్నాయి. ఇక్కడ తమిళనాడు వారు ముగ్గురు వ్యాపారం చేస్తున్నారు. వారెవరితోనూ మాకు సమస్య లేదు.అమంగల్ పట్టణ పరిధిలో 230 షాపులు స్థానికులు నిర్వహిస్తుంటే, 12 మార్వాడీలు నిర్వహిస్తున్నారు. కానీ ఆమనగల్లు చుట్టుపక్కల తలకొండపల్లిలో ఆరు షాపులు, చిన్న గ్రామం గట్టి పిలకల్‌లో 4 షాపులు, సంద్రగనంలో 3 షాపులు, పడకల్‌లో 3 షాపులు, కేశంపేటలో 8 షాపులు మార్వాడీలు పెట్టారు. ఇవన్నీ 20 కి.మీ. పరిధిలోనే.ఈ ఆరోపణలతోనే తాము బంద్‌కు పిలుపుని చ్చామని ఆమనగల్లు వ్యాపారుల సంఘం తెలిపింది. కానీ అనూహ్యం గా రాష్ట్రవ్యాప్త మద్దతు రావడంతో వారు వెనక్కు తగ్గారు."మాకు ఎక్కడెక్కడి నుంచో అన్ని రంగాల వారూ ఫోన్లు చేసి మద్దతిచ్చారు. మీరు తగ్గొద్దు, మేం వచ్చి మద్దతిస్తాం అన్నారు. దీంతో ఇది రాజకీయ రంగు పులుముకుంది. నిజంగా అంతమంది ఆమనగల్లు వచ్చిన తరువాత ఏదైనాజరగకూడని ఘటన జరిగితే మావ్యాపారులే నష్టపో తారు. అందుకే ప్రస్తుతానికి బంద్ వాయిదా వేశాం. కానీ మార్వాడీ వ్యాపారులపై మా పోరాటం కొనసాగుతుంది. ఇది హిందువులకు వ్యతిరేకం కాదు" అన్నారు తిరుపతయ్య. మార్వాడీ వ్యతిరేక ఆందోళనకారులు వెలిబుచ్చిన అభిప్రాయాల్లో ఒక విషయం ఉమ్మడిగా కనిపించింది. అది మార్వాడీలు పెద్ద నగరాలు, హోల్ సేల్ వ్యాపారాలు చేయడం కన్నా, చిన్న చిన్న పల్లెల్లో, రీటెయిల్ దుకాణాలు నడపడంపై చాలా మందికి అసంతృప్తి ఉందని తెలుస్తోంది.'హోల్‌సేల్ వ్యాపారాలు చేయవద్దనడం లేదు. కానీ రీటెయిల్ వ్యాపారాలు స్థానికులకు వదిలేయాలి. పల్లెటూరొచ్చి అక్కడ కూడా మేమే హిందీ మాట్లాడాలంటే ఎలా?" అంటూ ప్రశ్నించారు పిడమర్తి రవి.''వీరి వల్ల తెలంగాణలో ఉత్పత్తి కులాలు దెబ్బతింటున్నా యి. వారు నాసిరకం సరకు అమ్ముతున్నారు. తెలంగాణలో స్వర్ణకారుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. తెలంగాణ వ్యాపారులు దుకాణాల కోసం లక్ష అడ్వాన్స్ ఇస్తే వీరు అదే చోట 5 లక్షలు ఇచ్చి ఇతరులకు దుకాణం దక్కనివ్వకుండా చేస్తున్నారు. ఈ ఆందోళన తెలంగాణ ప్రజల ఐక్యత కోసం. తెలంగాణవారు ఇతర రాష్ట్రాలకు ఉపాధికి వెళ్లినా, వ్యాపారాలకు వెళ్లినా అక్కడ సాంస్కృతిక పెత్తనం చేయడం లేదు. అక్కడి స్థానికులను కొట్టడం లేదు. ఆధిపత్యం చెలాయించడం లేదు. మాది ఒకటే డిమాండ్ ఇక్కడ వ్యాపారాలు చేసేవారు 80 శాతం స్థానికులకు ఉపాధి కల్పించాలి" అని చెప్పారు పగిడిపల్లి శాంసన్."మార్వాడీలు ఇక్కడ 250 ఏళ్లకు పైబడి ఉంటున్నారు. వారు ఇక్కడి రాజుల ఆహ్వానం మేరకు వచ్చారు. ఈ మధ్య గ్రామీణ ప్రాంతంలో మార్కెట్ కాస్త నెమ్మదించడం వల్ల, రియల్ రంగం దెబ్బతిని డబ్బు సర్క్యులేషన్ తగ్గింది. దానికి కారణం కొత్తగా వచ్చిన వ్యాపారులే అని, వీరి వల్ల తమ వ్యాపారం తగ్గిపోతోందని మార్వాడీలపై వ్యతిరేకత పెంచుకోవడం కనిపిస్తోంది. కానీ ఇలాంటి దారుణమైన భాషతో పాట రాయడం సరికాదు. వారితో ఏదైనా సమస్య ఉంటే కూర్చుని మాట్లాడవచ్చు. కానీ గోబ్యాక్ నినాదం సరికాదు" అని హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది జయ్ సోలంకి అన్నారు. ఆయన ఓ మార్వాడీ."ఇక్కడి నుంచి ఎవర్నీ వెళ్లిపొమ్మనడం లేదు. కానీ స్థానికులకూ ఉపాధి ఇవ్వమంటున్నాం" అన్నారు శాంసన్.తామిక్కడ తెలంగాణను సొంతం చేసుకుని, ఈ నేలతో మమేకం అయ్యామంటున్నారు మార్వాడీలు."మా కుటుంబం ఇక్కడకు వచ్చి 90 ఏళ్లైంది. మా నానమ్మ, నాన్న ఇక్కడే పుట్టారు. నేను, నా కొడుకు ఇక్కడే పుట్టాం. మేం ఈ సమాజానికి ఎంతో కంట్రిబ్యూట్ చేశాం. కానీ ఇప్పుడు మమ్మల్ని భయపెడుతున్నారు. ఇది ప్రమాదకరంగా మారుతుంది. గోబ్యాక్ అని మొదటిసారి వింటున్నాను. మేం దీన్ని మా సొంత ప్రాంతంగా భావించాం. మేం ఎప్పుడైనా రాజస్థాన్ వెళ్తే అక్కడ మమ్మల్ని హైదరాబాదీలనే అంటారు. కానీ ఇక్కడి తెలంగాణవారు మమ్మల్ని కాదు అంటున్నారు. మరి మేం ఎవరం?" అన్నారు జయ్.వ్యాపార పరంగా కూడా మార్వాడీలపై చేసిన ఆరోపణలను మార్వాడీ వ్యాపారులు ఖండిస్తున్నారు.'ఎక్కడైనా వ్యాపారం చేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. రాజస్థాన్‌లో నిర్మాణ రంగం నుంచి గుజరాత్‌లో వస్త్ర వ్యాపారం వరకూ తెలుగువారు, తెలంగాణవారు ఉన్నారు. ఇక్కడ మార్వాడీలు ఏళ్ల నుంచి ఉన్నారు. ఇక్కడి రెవెన్యూకి, జీడీపీకి మేం కంట్రిబ్యూట్ చేశాం. విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నప్పుడు, మార్వాడీ పెట్టుబడులు ఎందుకు వద్దు? ఇక్కడి భాష, సంస్కృతి మాకు తెలుసు. కానీ కొందరు నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం సికింద్రాబాద్‌లో జరిగిన వ్యక్తిగత గొడవను మొత్తం వర్గానికి ఆపాదిస్తున్నారు" అని హైదరాబాద్ కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ ఆనరరీ కార్యదర్శి, ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్ కన్వీనర్ అవినాశ్ దేవ్డా అన్నారు."మేం ఈ రాష్ట్రవాసులుగా గర్విస్తాం. గుజరాత్, రాజస్థాన్‌లలో భూములు అమ్ముకుని ఇక్కడకు వచ్చి వ్యాపారం చేస్తున్నవారు ఉన్నారు. చాలా కష్టపడుతున్నారు. మేం కస్టమర్లతో బాగా మాట్లాడతామని నా తెలంగాణ స్నేహితులే నాకు చెప్పారు" అని చెప్పారు అవినాశ్"మార్వాడీలకు చెందిన అనేక కంపెనీలలో తెలంగాణ వారు పెద్ద సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడకు మా కుటుంబం వచ్చి 108 ఏళ్లవుతోంది. మూడో తరం మాది. రాజకీయాల్లో ఎదగడం కోసం కొందరు ఇలా చేస్తున్నారు" అన్నారు అవినాశ్తెలుగునాట మార్వాడీలు అనగానే ఒకే కులం వారు అనే అభిప్రాయం ఎక్కువ మందిలో కనిపిస్తుంది. ప్రస్తుత రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతానికి చెందిన వారినే మార్వారీ లేదా మార్వాడీ అంటారు. జోధ్‌పుర్, జైసల్మేర్, బికనేర్, అజ్మీర్ వంటి నగరాలలో విస్తరించిన ప్రదేశం ఇది. వీరు మాట్లాడే భాషను మార్వాడీ అంటారు. అది స్థూలంగా రాజస్థానీ భాషల సముదాయంలోకి వస్తుంది.ఈ ప్రాంతంలో అనేక కులాల వారు ఉంటారు. ప్రధానంగా హిందు, జైన మతాల వారు ఉంటారు. థార్ ఎడారి ఉండే ప్రాంతం ఇదే. మార్వాడీ అనే పదం కూడా ఎడారి ప్రాంతంలో ఉండేవారు అనే అర్థం నుంచి వచ్చింది.హిందూ రాజుల కాలంతో పాటు, మొఘలులు, బ్రిటిష్ వారి హయాంలో కూడా వారు అప్పటి రాజులతో మంచి సంబంధాలు నెరపుతూ భారత్ వ్యాప్తంగా వ్యాపార రంగంలో బాగా విస్తరించినట్టు కొందరు చరిత్రకారులు రాశారు.ఆ నగరాలతో పాటు హైదరాబాద్‌లో కుతుబ్ షాహీల కాలంలోనే మార్వాడీ-గుజరాతీ వ్యాపారులు ఉన్నట్టు అనేకమంది చరిత్రకారులు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని బేగం బజార్, సుల్తాన్ బజార్, మోండా మార్కెట్, గోషా మహల్ వంటి చోట్ల వీరు కనిపిస్తారు.బంగారం, బట్టల వ్యాపారాల్లో వారు ఎక్కువగా కనిపించినా, తినుబండారాలు, రెస్టారెంట్లు, ఎలక్ట్రికల్, పెయింట్, సిమెంట్, శానిటరీ వంటి షాపుల్లోనూ వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది.వలస వచ్చిన మార్వాడీలలో ఎక్కువ మంది వ్యాపారులే కనిపించినా, ఇతర వృత్తుల వారు కూడా ఉంటారు. సంప్రదాయ వ్యాపార కులాలైన బనియా వంటి వారే కాక ఇతర కులాలకు చెందిన మార్వాడీలు కూడా వ్యాపారాల్లో కనిపిస్తారు.2011 జనాభా లెక్కల ప్రకారం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 76,480 మంది మార్వారీ భాష మాట్లాడేవారు ఉన్నట్టు తెలుస్తోంది. దేశంలో మార్వారీలు దాదాపు 78 లక్షల మంది ఉండగా, వారిలో ఎక్కువ మంది రాజస్థాన్‌లోనే ఉంటారు. ఆ తరువాత అత్యధికంగా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆ తరువాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వారు ఉన్నారు. దేశవ్యాప్తంగా మాట్లాడేవారి సంఖ్య ప్రకారం, మార్వారీ భాష 20వ స్థానంలో ఉంటుంది.జాతీయ రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ రెండూ కూడా మార్వాడీలకు మద్దతుగా నిలిచాయి."మార్వాడీలు ఈ రాష్ట్రంలో భాగం. ఏళ్ల నుంచి ఉన్నారు. ఎవరూ వారిని ఇక్కడ నుంచి వెళ్లగొట్టే పరిస్థితి ఉండదు. దాన్ని కాంగ్రెస్ పార్టీ సమర్థించదు" అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.మార్వాడీలు సంపద సృష్టిస్తారు తప్ప ఎప్పుడూ దోచుకోలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. మార్వాడీ గో బ్యాక్ నినాదం హిందూ సమాజాన్ని చీల్చే కుట్ర అని ఆరోపించారాయన. వారు వ్యాపారం చేసుకుంటే తప్పులేదని, వారు తెలంగాణ నుంచి ఎందుకు వెళ్లాలని ప్రశ్నించారు. రోహింజ్యాల గురించి, ముస్లిం వ్యాపారుల గురించి ఎవరూ ఎందుకు మాట్లాడరని ఆయన ప్రశ్నించారు" రోహింగ్యాల బాధ్యత ప్రభుత్వం, పోలీసులది. బంగ్లాదేశ్, బెంగాల్ దాటి వారు ఇక్కడ వరకూ వచ్చేదాకా ఎవరు చూశారు? ఎవరూ పాకిస్తాన్ వారిని, రోహింజ్యాలను స్వాగతించరు.

# బైరాన్‌పల్లి నెత్తుటి గాథకు 77ఏళ్లు..

**-రజాకార్లపై తిరుగుబాటు అదో వీరపోరాటం**

**-సాయుధ పోరులో 118 మంది వీరమరణం**

**-చరిత్ర పుటల్లో స్థానం దొరకని రక్తాక్షరం**




సరిగ్గా 77 ఏళ్ల క్రితం...బైరాన్‌పల్లిలో నరమేధం... మట్టిమనుషుల తిరుగుబాటు.. దోపిడీపై దండయాత్ర.. నిజాం మూకలపై నిప్పుల యాత్ర.. అగ్ని జ్వాలలై రగిలిన నెత్తుటి మడుగు.. గడ్డి కోసిన చేతులే కొడవళ్లు పట్టాయి. బువ్వొండిన చేతులే తుపాకీలు పట్టాయి. దొరల దాష్టీకాలకు... రజాకార్ల రాక్షసత్వానికి వ్యతిరేకంగా పిడికిలెత్తాయి. గడీల పాలనను ప్రజలే తరిమికొట్టారు. సామాన్యులే సాయుధులై రణనినాదం చేశారు. రైతన్నలే నిప్పుకణికలై విప్లవ శంఖం పూరించారు. వీర యోధుల త్యాగాలకు నెత్తుటి సాక్ష్యమే బైరాన్ పల్లి. నాటి తరానికే కాదు... నేటి తరానికీ స్ఫూర్తినిస్తోంది. బైరాన్‌పల్లిలో నరమేధం జరిగింది. సాయుధ పోరులో 118 మంది వీరమరణం పొందారు. భారత చరిత్రలోనే మాయని మచ్చగా నిలిచినా... భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమైందిఅది 1948 ఆగస్టు 27ఆ రోజు బైరాన్‌పల్లిలో ఉన్మాదం తాండవించింది. గ్రామ స్వరాజ్యం కోసం 92 మంది ఒకే రోజు నిజాం సేనల చేతుల్లో బలయ్యారు.బైరాన్‌పల్లి పోరాటం కేవలం నిజాం వ్యతిరేక పోరాటమే కాదు.. చరిత్రలోకి తొంగిచూస్తే అది బ్రిటిష్ వ్యతిరేక పోరాటం.. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం.. నిజాం సేనలను తొలుత ఊరి పొలిమేరల్లోకి తరిమికొట్టిన సాహసం వారిది. గ్రామాలపై దాడులు చేసి ఊళ్లకు ఊళ్లే తగలబెట్టి వల్లకాడుగా మార్చారు రజాకార్లు. నిజాం రజాకార్ల అకృత్యాలకు ఎంతోమంది తమ మాన ప్రాణాలను కోల్పోయారు. వీరుల్ని నిరాయుధుల్ని చేసి ప్రాణాలు తీసిన పిరికిపందల చరిత్ర ఒక వైపు ఉంటే.. మరోవైపు త్యాగాల చరిత్ర.. వ్యక్తి స్వార్థం లేని ఒక సమూహ లక్ష్యం కలిగిన మహోన్నత చరిత్ర.. వరంగల్ జిల్లాలోని బైరాన్‌పల్లి నేడు వీర బైరాన్‌పల్లిగా మారింది. జనగామ డివిజన్ మద్దూర్ మండలంలోని గ్రామం బైరాన్‌పల్లి...ఏనాటికీ బైరాన్‌పల్లి పోరాట చరిత్ర మరువనిది. అనేకసార్లు నిజాం మూకలను తరిమికొట్టిన గ్రామం. వీరోచిత పోరాట కేంద్రం. నిజాం మూకల తూటాలకు, సైన్యం వికృత క్రీడకు బలిపశువయినా శౌర్యాన్ని చూపింది. తిరుగుబాటుకు నెలవుగా మారింది. పోరాటకాలంలో బైరాన్‌పల్లి ప్రజలు ప్రక్క గ్రామాల ప్రజలకు అండగా నిలిచారు. రజాకార్లకు ఎదురొడ్డి త్యాగాలు చేశారు. సాటి మనిషి పట్ల ఆ గ్రామం చూపిన తెగువ తెగిపోతున్న మానవ సంబంధాలకు ఆదర్శం. ఆపదొస్తే ఆదుకోవటం ఎంత బాధ్యతో లింగాపూర్ ఘటన అద్దంలా కనబడుతున్నది. ఆంధ్రమహాసభ పేరుతో ప్రజల్లోకి వచ్చిన ఎర్రజెండా నింపిన చైతన్యం అలాంటిది.ఓ వైపు యావత్ భారతదేశం స్వాతంత్ర్య సంబురాల్లో మునిగితేలుతూ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతుండగా మరో వైపు నిజాం రాజుల ఏలుబడిలో ఉన్న పల్లెలన్నీ రజాకారు మూకల ఆగడాలు, దుశ్చర్యలతో వణికిపోతున్నాయి. రజాకార్లను ఎదురించి పోరాడలేక పల్లె ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. రజాకార్ల దురాగతాలను భరించలేక వారిపై తొలిసారిగా తిరుగుబాటు ప్రకటించి జంగ్‌సైరన్ చేసిన గ్రామమే.. వీరబైరాన్‌పల్లి. ఈ గ్రామానికి ఉన్న చారిత్రక నేపథ్యం మరే గ్రామానికి లేదనడంలో సందేహం లేదు. బైరాన్‌పల్లి.. ఈ ఊరు పేరు వింటేనే రజాకార్లు హడలిపోతారు. గ్రామంలో అడుగుపెట్టేందుకు నిజాం సైన్యాలు వణికిపోతాయి. పిల్లల నుంచి పడుచు యువతుల దాకా..అంతా ఒక్కటై హైదరాబాద్ సంస్థానాన్ని సవాల్ చేస్తున్న కాలమది. నిజాం చీకటిపాలన నుంచి బయటపడి భారత యూనియన్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛాగాలులు పీల్చాలని ప్రతి గుండె, ప్రతి గ్రామం తహతహలాడుతున్న సందర్భమది. వరంగల్ జిల్లా బైరాన్‌పల్లి (నాటి నల్లగొండ జిల్లా) ఈ ఆకాంక్షలకు నిలువెత్తు ఆకృతిగా నిలిచింది. ఫలితం..గ్రామరక్షణ దళం ఏర్పాటుబైరాన్‌పల్లిలో ఇమ్మడి రాజిరెడ్డి, దుబ్బూరి రామిరెడ్డి, మోటం రామయ్యలాంటి యువకులు గ్రామరక్షణ దళాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి పన్నులు కట్టడం మానేశారు. దొరలపై ధిక్కార స్వరం వినిపించి గ్రామమంతా ఒకేతాటిపై నిలిచేలా చేశారు. తమ పొరుగు గ్రామమైన లింగాపూర్‌పై దాడిచేసి ధాన్యాన్ని ఎత్తుకెళుతున్న క్రమంలో... బైరాన్‌పల్లి గ్రామరక్షక దళం నాయకులు, గ్రామస్తులంతా ఏకమై గొడ్డళ్లు, బరిసెలు, ఒడిసెలతో ఎదురుదాడికి దిగారు. దీంతో కక్షగట్టిన రజాకార్లు బైరాన్‌పల్లిని విధ్వంసం చేయాలనే నిర్ణయానికొచ్చారు.1948 మే నెలలో బైరాన్‌పల్లిపై దాడికి విఫలయత్నం1948 మే నెలలో 60 మంది రజాకార్లు తుపాకులతో బైరాన్‌పల్లిపై దాడికి ప్రయత్నించి విఫలమయ్యారు. రెండోసారి 150 మంది రజాకార్లు పోరుగ్రామంపై దాడికి పాల్పడి ఓటమి చెందారు. ఇలా రెండుసార్లు ఘోరంగా విఫలమైన రజాకార్లు బైరాన్‌పల్లిపై ప్రతీకారం పెంచుకున్నారు. 1948 ఆగస్టు 27న రాక్షసులు పంజా విసిరారు. పారిపోవడానికి ప్రయత్నించిన ప్రజలందరిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలను నగ్నంగా చేసి.. బతుకమ్మ ఆడించిన రజాకార్ల పైశాచిక ఆనందం నేటికీ వారి మనసుల్లో మానని గాయంగానే మిగిలిపోయింది.అవి రజాకార్లు గ్రామాలపై పడి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటూ రాక్షస క్రీడలను కొనసాగిస్తున్న రోజులు. వారిని ఎదిరించి పోరాడేందుకు యువకులంతా కలిసి గ్రామ రక్షక దళంగా ఏర్పడ్డారు. దూళ్మిట్ట, కూటిగల్, లింగాపూర్, బైరాన్‌పల్లిలోని గ్రామ రక్షక దళాలు బైరాన్‌పల్లిని ముఖ్య కేంద్రంగా చేసుకొని రజాకార్ల ఆగడాలను తిప్పికొట్టసాగారు. దీనికి ప్రతిగా రజాకార్లు గ్రామాలపై మూకుమ్మడి దాడులు చేస్తూ ఇళ్లను తగులబెట్టి దోపిడీకి పాల్పడే వాళ్లు. గ్రామాలపై దాడులు చేసి దోచుకున్న సంపదతో తిరిగి రజాకార్లపై బైరాన్‌పల్లి వద్ద దూబూరి రాంరెడ్డి, ముకుందాడ్డి, మురళీధర్‌రావు నాయకత్వంలో గ్రామ రక్షణ, గెరిల్లా దళాలు దాడిచేసి దోపిడీ సంపదను స్వాధీనం చేసుకొని పంచిపెట్టాయి.ఈ ఘటన తర్వాత బైరాన్‌పల్లిపై రజాకార్లు ఏ క్షణానైనా దాడికి పాల్పడే అవకాశముందనే అనుమానంతో గ్రామం నడిబొడ్డున ఎత్తైన బురుజు నిర్మించారు. బురుజుపైన మందుగుండు సామక్షిగిని నిల్వ చేసుకున్నారు. అనుమానితులు కనిపిస్తే బురుజుపై కాపాలా ఉండే ఇద్దరు వ్యక్తులు నగారా (బెజ్జాయి) మోగించడంతో ఆ శబ్దానికి సమీప గ్రామాలైన వల్లంపట్ల, కూటిగల్, బెక్కల్, కొండాపూర్, లింగాపూర్, దూళ్మిట్ట గ్రామాల ప్రజలు పరిగెత్తుకొంటూ వచ్చేవారు. రెండుసార్లు బైరాన్‌పల్లిపై దాడికి ప్రయత్నించిన రజాకార్లను గ్రామరక్షక దళాలు తిప్పికొట్టడంతో 40 మంది రజాకార్లు ప్రాణాలు కోల్పోయారు. దీంతో కక్షగట్టిన రజాకార్లు ఏరియా కమాండర్ ఆషీం ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి రప్పించిన 500 మంది నిజాం సైనికులతో 1948 ఆగస్టు 27 తెల్లవారుఝామున బైరాన్‌పల్లిపై మూకుమ్మడి దాడి చేసి ప్రతీ ఇంట్లోకి ప్రవేశించి యువకులను బంధించి ఊరిబయటకు తీసుకువచ్చి లెంకలుగట్టి 96 మందిని కాల్చి చంపారు. మహిళలను వివస్త్రలుగాచేసి కుప్పగావేసిన మృతదేహాల చుట్టూ నగ్నంగా బతుకమ్మ ఆడించారు.బైరాన్‌పల్లిలో ఆరోజు ఏం జరిగింది..? 1948 ఆగస్టు చివరి వారంలో అర్ధరాత్రి, ఆ ఊరికి కాళరాత్రి అయింది. నిరంకుశత్వం.. దానవరూపమెత్తి ఊరి మహిళలను చెరబట్టింది. దాదాపు వందమందిని నిలబెట్టి నిలువునా కాల్చిచంపిందిఒకే రోజు 92 మంది గ్రామస్తులను రజాకార్లు పొట్టన పెట్టుకున్నారు. నాటి మారణకాండకు గ్రామం నడిబొడ్డులో ఉన్న బురుజు సాక్షీభూతంగా ప్రస్తుతం దర్శనమిస్తోంది. రజాకార్లను ఎదిరించేందుకు బైరాన్‌పల్లి గ్రామంలోని యువకులంతా కలిసి గ్రామ రక్షక దళంగా ఏర్పడ్డారు. ఒక రోజు రజాకార్లు గ్రామానికి సమీపంలో ఉన్న ధూళ్మిట్ట, లింగాపూర్ గ్రామాలను రజాకార్లు దోచుకొని, దోచుకున్న సొత్తుతో బైరాన్‌పల్లి మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. దీనిని గమనించిన గ్రామరక్షక దళాలు రజాకార్లకు అడ్డు తిరిగి వారి వద్ద నుండి సొమ్మును స్వాధీనం చేసుకొని హెచ్చరికలు జారిచేస్తూ రజాకార్లను వదిలి వేసారు. దీంతో గ్రామంపై కక్ష పెట్టుకున్న రజాకారు మూకలు గ్రామం పై ఐదు సార్లు దాడి చేసి విఫలమయ్యారు. ఈ దాడులలో 20 మందికి పైగా రజాకార్లు మృతి చెందారు. దీంతో అప్పటి భువనగిరి డిప్యూటీ కలెక్టర్ హసీం బైరాన్‌పల్లి గ్రామాన్ని తిరుగుబాటు గ్రామంగా ప్రకటించి, గ్రామాన్ని నేల కూలుస్తానని సవాలు చేశాడు. రజాకార్లు ఏదో ఒక రోజు గ్రామంపై దాడి చేసే అవకాశం ఉందని భావించి గ్రామస్తులు గ్రామం చుట్టూ కోట గోడ నిర్మించుకొని మధ్యలో ఎత్తైన బురుజును నిర్మించుకొని దానిని రక్షణ కేంద్రాంగా మలుచుకున్నారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే బురుజుపైన ఉన్న గ్రామ రక్షక దళ సభ్యులు నగారాను మోగించేవారు.ఏరులై పారిన రక్తం..1947 ఆగస్ట్ 15వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాం రాష్ట్రంలో స్వేచ్ఛా వాయువులు వీయలేదు. మద్దూరు మండలం బైరాన్ పల్లి గ్రామం సహా చాలా గ్రామాల్లో రజాకార్ల పాశవిక దాడులకు అంతులేకుండా పోయింది. అయితే. బైరాన్‌పల్లి.. గట్టిగా నిలబడింది. ఊళ్లోని బురుజును స్థావరం చేసుకొని గ్రామంలోకి వచ్చిన రజాకార్లను ప్రతిఘటించి తరిమికొట్టేది. గ్రామరక్షణ దళాలను ఏర్పాటుచేసుకొని రాత్రింబవళ్లూ కాపలా కాసేవారు. బైరాన్ పల్లి గ్రామంపై పట్టుకోసం రజాకార్లు ఐదుసార్లు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో సుమారు 24 మం దికిపైగా రజాకార్లు ప్రజల చేతుల్లో మరణించారు. దీంతో బైరాన్‌పల్లిపై నిజాం మూకలు కక్ష పెంచుకున్నాయి. చివరకు దొంగదాడికి పాల్పడ్డాయి.1948 ఆగస్టు చివరి వారంలో రజాకార్లు, పోలీసులు..నిజాం సైన్యం సాయంతో 12 వందల మంది దాడికి దిగారు. జనగామలో రాత్రి 12గంటలకు పది బస్సులలో బయలుదేరారు. లద్దునూరు మీదుగా బైరాన్‌పల్లి చేరుకున్నారు. గ్రామం చుట్టూ దేరాలు వేశారు. ఉదయం నాలుగు గంటలకు బహిర్భూమికి వెళ్లిన వడ్ల నర్సయ్యను అదుపులోకి తీసుకున్నా రు. ఆయనను వెంటబెట్టుకొని గ్రామంలోకి వస్తుండగా, వారిని నెట్టివేసి నర్సయ్య ఊళ్లోకి పరుగుపెట్టాడు. రజాకార్లు గ్రామంలోకి చొరబడ్డారంటూ ప్రజలను అప్రమత్తం చేశాడు. నగారా మోగించాడు.

# సినిమా..

## పవన్ కళ్యాణ్ చేతిపై జపనీస్ టాటూ.. దాని అర్థం ఏంటో తెలుసా?




ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మరోవైపు తన సినిమాల పనుల్లోనూ జోరుగా ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ఓజీ' (ఒరిజినల్గ్యాంగ్స్టర్) పై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాకు సంబంధించి ఇటీవల విడుదలైన రెండో పాట పోస్టర్ ఇప్పుడు ఆసక్తికరమైన చర్చకు దారితీసింది.దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పవన్ కల్యాణ్‌కు జోడీగా ప్రియాంక మోహన్ నటిస్తున్నా రు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో, దీపాల వెలుతురు మధ్య రొమాంటిక్ మూడ్‌లో కనిపించిన ఈ జంట ప్రేక్షకుల మన్న నలు అందుకుంది. అయితే ఈ పోస్టర్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం మాత్రం పవన్ కళ్యాణ్ చేతిపై కనిపించిన జపనీస్ టాటూ. సోషల్ మీడియాలో ఈ టాటూ పెద్ద చర్చనీయాంశంగా మారింది. అభిమానులు దాని అర్థం గూగుల్‌లో వెతుకుతూ అన్వేషణ మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆ మూడు జపనీస్ అక్షరాలు వీటిని సూచిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది: మొదటి అక్షరం – వాగ్దానం, రెండో అక్షరం–బలం, మూడో అక్షరం–నిప్పు. ఈ మూడు పదాలు కలిపి పవన్‌కల్యాణ్ 'ఓజీ'లో పోషిస్తున్న పాత్ర యొక్క లోతు, లక్ష్యం, మరియు ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తున్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, మొదటి పాట సినిమాపై భారీ హైప్‌ను సృష్టించగా, ఈ టాటూ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల విడుదలైన చిత్రం మొదటి పాట ఎంత సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. థీమ్ సాంగ్ గా సాగిన పాట లిరిక్స్,థమన్ అందించిన క్యాచీ ట్యూన్ మ్యూజిక్ లవర్స్ ను ఎంత గానో ఆకట్టుకున్నాయి. ఇక ప్రస్తుతం మేకర్స్ 2వ పాటను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో పాట వినాయక చవితి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో విలన్ గా ఇమ్రాన్ హాష్మీ నటిస్తున్నారు. సీనియర్ నటి శ్రియా రెడ్డి కీలక పాత్ర పోషిస్తోంది. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రాన్ని థమన్ ఎస్ సంగీతం అందిస్తుండటం విశేషం. ఇక సెప్టెంబర్ 25, 2025న వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ ను పూర్తి చేసుకుంటున్నారు.

## హద్దులు చెరిపేస్తున్న తమన్నా...




మిల్క్ బ్యూటీగా దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటి తమన్నా భాటియా, ఇప్పుడు తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన అడుగు వేయబోతున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో హారర్ మరియు బోల్డ్ కంటెంట్‌తో సంచలనం సృష్టించిన 'రాగిణి MMS ఫ్రాంచైజీలో ఆమె నటించబోతోందన్న వార్త ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సిరీస్‌లో మూడవ భాగంగా రాబోతున్న చిత్రంలో తమన్నానే కథానాయిక అని గట్టిగా ప్రచారం జరుగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రాజెక్ట్ కోసం నిర్మాత ఏక్తా కపూర్ స్వయంగా తమన్నాతో చర్చలు జరిపారు. ఈ ప్రతిపాదనకు తమన్నా కూడా సానుకూలంగా స్పందించినట్లు, ఇరు వర్గాల మధ్య ఒప్పందం దాదాపు ఖరారైనట్లు బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. ఈ పాత్ర కోసం తన కంఫర్ట్ జోన్‌ను దాటి, కొన్ని బోల్డ్ సన్నివేశాల్లో నటించేందుకు కూడా ఆమె సిద్ధపడినట్లు సమాచారం.గత కొంతకాలంగా తమన్నా తన కెరీర్ గ్రాఫ్‌ను పూర్తిగా మార్చే ప్రయత్నంలో ఉన్నారు. 'జైలర్' చిత్రంలో ప్రత్యేక గీతంతో మాస్‌ను ఉర్రూతలూగించిన ఆమె, 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌లో బోల్డ్ పాత్రలో నటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సీనియర్ హీరోయిన్లు క్లాసిక్ పాత్రలకే పరిమితమవుతుంటే, తమన్నా మాత్రం గ్లామర్ మరియు నటనకు ఆస్కారమున్న విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'రాగిణి MMS 2' చిత్రంలో సన్నీ లియోన్ నటన, 'బేబీ డాల్' పాట సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఇప్పుడు అదే ఫ్రాంచైజీలో తమన్నా అడుగుపెట్టనుండటంతో అంచనాలు భారీగా పెరిగాయి. సన్నీ లియోన్ నెలకొల్పిన బెంచ్‌మార్క్‌ను తమన్నా అందుకుంటుందా? లేక తనదైన శైలిలో ఆమెను మించిపోతుందా? అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ వార్త నిజమైతే, తమన్నా కెరీర్‌లో ఇది ఒక సంచలన చిత్రంగా నిలిచిపోవడం మాత్రం ఖాయం.

## తళుకు బెలుకుల అందాలతో కట్టిపడేస్తున్న నిధి అగర్వాల్



తెలుగు ,తమిళ చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ సంపాదించుకున్న హీరోయిన్ లలో నిధి అగర్వాల్ కూడా ఒకరు. ఈ అమ్మడు 2017లో వచ్చిన 'మున్నా మైకేల్' అనే చిత్రం ద్వారా బాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 2018లో 'సవ్యసాచి' అనే చిత్రంతో నాగచైతన్యకు జోడిగా నటించి తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్ సినిమాలతో హీరోయిన్ గా భారీ పాపులారిటీ అందుకున్నది. 2021లో తమిళ సినిమా ఈశ్వరన్ తో ఎంట్రీ ఇచ్చిన నిధి అగర్వాల్.. ఆ తర్వాత ఎన్నో చిత్రాలలో నటించింది. ఇటీవల పవన్ కళ్యాణ్ తో హరిహర వీరమల్లు సినిమాలో కూడా నటించింది. అలా వరుస సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో కూడా అంతే యాక్టివ్ గా ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. నిరంతరం అభిమానులను ఖుషీ చేసేలా తన అందచందాలతో ఆకట్టుకుంటూ ఉంటుంది. తన సినిమా అప్డేట్లనే కాకుండా తనకు సంబంధించిన ఎలాంటి విషయాన్నైనా తెలియజేస్తూ ఉంటుంది నిధి అగర్వాల్. ఇప్పుడు తాజాగా ఈ ముద్దుగుమ్మ క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటున్న కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలకు క్యాప్షన్ గా సీతాకోకచిలుక సింబల్ ను జోడించింది. ఈ ఫొటోస్ చూసిన అభిమానులు నిధి అగర్వాల్ చాలా క్యూట్ గా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఒక్కో ఫోటోలో ఒక్కో యాంగిల్ లో ఫోజులిచ్చి న నిధి అగర్వాల్.. మిర్రర్ పొదిగిన డ్రెస్ ధరించి.. తళుకు బెలుకుల అందాలలో పాక్షికంగా ఎద అందాలు చూపిస్తూ రెచ్చగొట్టింది.. చిన్నటి స్మైల్ తో ఈ ఫోటోలకు మరింత అందాన్ని జోడించండి. నిధి అగర్వాల్ షేర్ చేసిన కొన్ని సెకండ్లలోనే ఫోటోలు తెగ వైరల్ గా మారుతున్నాయి. ప్రస్తుతం ఈమె నటిస్తున్న సినిమాల విషయానికి వస్తే.. ప్రభాస్ నటిస్తున్న ది రాజా సాబ్ చిత్రంలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఈమెతోపాటు మాళవిక మోహనన్, రిద్ధీ కుమార్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ప్రముఖ కమెడియన్ యోగి బాబు, బాలీవుడ్ స్టార్ హీరో సంజయ్ దత్ కూడా ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. మారుతీ దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ సినిమా కొంత భాగం షూటింగ్ మిగిలి ఉంది.

## 'మాస్ జాతర' చిత్రం వాయిదా



కాస్త ఆలస్యమైనా అసలుసిసలైన మాస్ పండుగను థియేటర్లలో తీసుకొస్తామని నిర్మాతలు హామీ ఇచ్చారు.

మాస్ మహారాజా రవితేజ అభిమానులతోపాటు, సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మాస్ జాతర' చిత్రం ఆగస్టు 27వ తేదీన థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది.

ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మెలు, కీలకమైన కంటెంట్‌ను పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతలు అధికారికంగా తెలిపారు. కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే.. కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు. మాస్ జాతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమాగా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు. అభిమానులు నిరీక్షణకు బహుమానంగా త్వరలో ఆశ్చర్యకర కంటెంట్ రాబోతుందని నిర్మాతలు హామీ ఇచ్చారు.

## బండ్ల గణేష్ ఇంట్లో స్టార్ స్టడెడ్ గెట్ టూ గెదర్..




టాలీవుడ్‌లో ఒకప్పుడు హిట్లు అందించిన నటుడు, నిర్మాత బండ్ల గణేష్ ఇప్పుడు సినిమాలకు కొంత దూరంగా ఉన్నప్పటికీ, అప్పుడ ప్పుడూ తన సినీమిత్రులతో కలిసి సందడి చేస్తుంటారు. తాజాగా ఆయన ఇంట్లో జరిగిన ప్రత్యేక పార్టీకి టాలీవుడ్‌కు చెందిన పలు ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ఆలీ, శ్రీకాంత్, బ్రహ్మాజీ, శివాజీ రాజా, కృష్ణవంశీ, కె. రాఘవేంద్రరావు, బీవీఎస్ రవి,రాజారవీంద్ర, శివాజీ వంటి పేరొందిన సినీ ప్రముఖు లు హాజరయారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను నటుడు బ్రహ్మజీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేస్తూ, "30 ఇయర్స్ ఇండస్ట్రీ. పార్టీకి థ్యాంక్యూ బండ్ల గణేష్ బ్రో. యంగ్ అండ్ డైనమిక్ డైరెక్టర్స్‌తో.. సీనియర్ సిటిజన్స్.. కాదు కాదు, సీనియర్ యాక్టర్స్ " అని ఫన్నీ క్యాప్షన్ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరలవుతున్నాయి. నెటిజన్ల నుంచి భిన్నమైన కామెంట్లు, మీమ్స్ కూడా వచ్చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పాత తరం హీరోలు, దర్శకులు తరచూ రీ యూనియన్ పేరుతో కలుస్తూ అభిమానులని తెగ అలరిస్తున్నారు. తాజాగా బండ్ల గణేష్ ఇంట్లో జరిగిన ఈ గెట్ టుగెదర్ కూడా అలాంటి వాతావరణాన్నే తలపించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అందరూ ఎన్నో ఏళ్లుగా ఇండస్ట్రీలో తమదైన ముద్ర వేసినవారే. ఇదే తరహాలో ఇటీవల గోవాలో గ్లామరస్ రీ యూనియన్ పార్టీ జరిగింది. శ్వేత కొన్నూర్ మీనన్, ఊహ, శివ రంజని, డైరెక్టర్స్ కేఎస్ రవికుమార్, శంకర్, లింగుసామి, మోహన్ రాజా, ప్రభుదేవా, శ్రీకాంత్, జగపతి బాబు తదితరులు పాల్గొన్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. మరోవైపు 90లలో అదరగొట్టిన హీరో, హీరోయిన్స్ కూడా అప్పుడప్పుడు ఇలా రీయూనియన్ పార్టీలు జరుపుకుంటూ సందడి చేస్తుంటారు.

## 41 ఏళ్ల క్రియేటివ్ ప్రయాణానికి ముగింపు



భారత సినిమా పరిశ్రమలో విలక్షణమైన హాస్యాన్ని, సున్నితమైన కథనాలను తెరపై ఆవిష్కరించిన ప్రఖ్యాత దర్శకుడు ప్రియదర్శన్ తన డైరెక్షన్ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. 41 ఏళ్ల సినిమాటిక్ ప్రయాణం తర్వాత తన 100వ చిత్రంతో దర్శకత్వం నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్టు తెలిపారు. మలయాళంలో రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ప్రియదర్శన్, హిందీ సినిమాలలో 'హేరా ఫేరీ', 'భూల్ భులయ్యా', 'హంగామా' వంటి అద్భుత హాస్య చిత్రాలతో స్టార్ డైరెక్టర్‌గా ఎదిగారు. తెలుగులోనూ అక్కినేని నాగార్జునతో 'నిర్ణయం', నందమూరి బాలకృష్ణతో 'గాంఢీవం' చిత్రాలు తెరకెక్కించారు. ప్రస్తుతం అక్షయ్ కుమార్, పరేష్ రావల్, సంజయ్ దత్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న 'హేరా ఫేరీ 3' సినిమాను ప్రియదర్శన్ డైరెక్ట్ చేస్తున్నారు. అలాగే, అక్షయ్ కుమార్‌తో కలిసి ఆయన 'ఒప్పం' హిందీ రీమేక్ 'హైవాన్' తెరకెక్కిస్తున్నారు. ఈ రెండు సినిమాల తర్వాత, తన 100వ సినిమాగా మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌తో కలిసి ఒక చిత్రం చేయనున్నట్టు చెప్పారు."మొదటి సినిమా నుంచి ఇప్పటివరకు 41 ఏళ్లు గడిచిపోయాయి. డైరెక్షన్ పరంగా నేను పూర్తిగా అలసిపోయాను. నా 100వ సినిమాతో ఈ ప్రయాణానికి ముగింపు పలికే సమయం వచ్చింది" అని ప్రియదర్శన్ ప్రకటించారు. ప్రియదర్శన్ కూతురు కల్యాణీ ప్రియదర్శన్ ఇప్పటికే దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'హలో', 'చిత్రలహరి', 'రణరంగం' వంటి సినిమాల్లో నటించిన కల్యాణీ, ఇప్పుడు నస్లేన్ హీరోగా 'లోకా ఛాప్టర్ 1: చంద్ర' అనే చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆగస్టు 28న విడుదల కానుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215